అదృశ్య నేత్రాలు!

సికిందర్

గౌహతి పట్టణం ప్రశాంతంగా వుంది....

జయకర్ మనసు కూడా నిర్మలంగా, నిలకడగా వుంది. మూడు రోజుల అదుపు చేయలేని ఉన్మాద స్థితి నుంచి తీవ్రంగా పోరాడి అతనీ మానసిక స్థితిని సాధించాడు.

అలాంటి మూడు రోజులు అతని అనుభవంలో ఎన్నడూ లేవు! ఇప్పటికైనా ఆ వలయంనుంచి బయటపడినందుకు అభినందించుకుని పని కుపక్రమించాడు....మళ్ళీ ఆ ఊబిలో దిగబడకుండా చూసుకోవాలి!

కాయితం మీద కలం పెట్టినపుడు అతను ఉన్నట్లుండి ఉలికిపడ్డాడు; మూడు రోజులు! గాడ్! ఎంత వృధా! దీనికేమిటి సంజాయిషీ? ఈ మూడు రోజులూ తనేం చేశాడు? అతని కళ్ళముందు రావ్ ఉగ్రరూపం మెదిలి మళ్ళీ ఉలిక్కిపడ్డాడు.

ఫోన్ మోగింది.

4

అతను తడుటపడి రిసీవర్ అందుకున్నాడు.

అవతలి కంఠం అంది, "హలో, జయ్!"

జయకర్ కొయ్యబారిపోయాడు. ఆ కంఠం అతని దేహంలో చలిపుట్టించింది.

"హలో, ఏమిటి అల్కా?" అన్నాడతను అతి కష్టం మీద.

"మీనన్ ఊరికెళ్ళాడు. రేపటిదాకా రాడు!"

జయకర్ కు ఇంకా ఊపిరి సరిగా అందడంలేదు.

"ఐ—అయితే?"

"అయితే ఏమిటి, డార్లింగ్! వెంటనే నా దగ్గరికొచ్చేయి!"

ఊబి! జయకర్ ఉలిక్కిపడ్డాడు. అడుగునుంచి పైకి వూరే నీటి ఊట ఊబి! నీ అడుగు జాగ్రత్త! అంతరాత్మ ఘోష విన్నాడు.

"జయ్ మాట్లాడవేం?"

జయకర్ తేరుకొని తడబడ్డాడు. ఏం చెప్పాలో తట్టలేదు. ఆమె దగ్గరికి వెంటనే వచ్చేస్తానని చెప్పేయాలనుకున్నాడు—కానీ—మళ్ళీ రావ్ ఉగ్రరూపం కళ్ళముందు నిలిచింది. బాస్టర్డ్! ఎందుకీ ఆలస్యం? ఏం చేస్తున్నావ్? అతనిలాగే తిడ్తాడు.

"వీలవదు, అల్కా! ఈ పూట పని వుంది!" అన్నాడతను గట్టిగా.

"ఓహ్ డామిట్! నువ్వెప్పుడూ ఇంతే!"

"నే నెప్పుడు కాదన్నాను? నీ కారణంగా ఈ మూడు రోజులు ఏమీ చేయలేకపోయాను. నా మనసు స్వాధీనంలో లేదు! ఆలోచనలన్నీ నీ చుట్టే! ఈ పూట క్షమించు. అవతల బాస్ ని తృప్తిపర్చాలి.... తాత్కా

లికంగా ఇంత మేత పడేస్తాను. అప్పుడు నీతోనే వుంటాను. నువ్వెక్కడికి రమ్మన్నా—"

జయకర్ మనసు మళ్ళీ కల్లోలం తొలగించుకుంది.

"అవన్నీ చెప్పకు! నువ్వు గంటలోపల రావాలి! నీతో చాలా ముఖ్యమైన విషయం మాట్లాడాలి. రాక పోతే నేనంటే నీ కాసక్తి పోయిందని అనుకొంటాను—"

జయకర్ వెంటనే ఏదో అనబోయాడు. ఆలస్యమైంది. అప్పటికే లైను కట్ అయింది.

"హలో, హలో, అల్కా....?"

లాభం లేదనుకొని ఫోన్ పెట్టేసి నిట్టూర్చాడు. తల బరువెక్కి హఠాత్తుగా నీరసం కమ్మింది. అతను బెడ్ మీద కూలబడి కళ్ళు గట్టిగా మూసుకున్నాడు.

అల్కా!

ఎవరీమె? ఆమె తననెలా వశం చేసుకుంది? తానామె దాసుడెలా అయ్యాడు? ఇన్నేళ్ల బ్రహ్మచారి సర్వీసులో ఎవరికీ ఇలా లొంగలేదు! నిగ్రహం తప్పలేదు! ఎవరినీ ప్రేమించిన పాపాన పోలేదు!

మరి, ఈమె ఏ సమ్మోహనాస్త్రంతో తన్ని లొంగ దీసుకుని ఈ ప్రేమ మైకంలో దింపింది? ఆమెలో వున్న ఆకర్షణ ఏమిటి? ప్రత్యేకత ఏమిటి?

నిజానికి తానామె ఆకర్షణలో పడ్డానికి ఆమె బాధ్యత ఏమీ లేదు. అది పూర్తిగా తన బలహీనత! ఆ రోజు-సరిగ్గా మూడు రోజుల క్రితం—ఇదే హోటల్ ప్రాంగణంలో పరిచయమైనప్పుడు తన నిగ్రహమంతా ఉన్నపళంగా కుప్ప కూలిపోలేమూ? ఆమె తేనె రంగు కళ్ళలో కవ్వింపు చూసి గుండెలో గుర్రపు డెక్కల చప్పుడు విన్పించలేమూ? ఆమె గులాబీ రేకు పెదవుల

మీద పిచ్చెక్కించే నవ్వు చూసి నరాలు జివ్వుమనలేదూ? నారింజ రంగు సిల్కు కమీజ్, అదే రంగు షల్వార్; పొడవాటి జడతో, కాళ్ళకి మామూలు అరు చెప్పులతో నిరాడంబరంగా, చూపులకి గాలం వేసి లాక్కెళ్ళేలా సృష్టి జరిగిన అంగసౌష్టవాలతో ఆమె నిలువెత్తు విగ్రహం చూశాక, వొంట్లో వేడి అమాంతంగా రెట్టింపు కాలేదూ?

అల్కా—అల్కా—అల్కా!

ముఫైఅయిదేళ్ళ తన జీవత కాలంలో ఎన్నడూ స్త్రీ గురించి ఆలోచించి ఎరుగని తను, ఇలా ఆమె వ్యామోహంలో పడ్డం చాలా ఆశ్చర్యంగా వుంది. ఇలా ఎందుకు జరిగిందో తెలియడంలేదు. కానీ ఇదేమీ అసహజం కాదని తెలుసు. అయితే ఎందుకో పొరపాటు చేస్తున్నాడన్పిస్తోంది....

ఆమె వివాహిత! అయినా అదేమీ పట్టించుకోనట్లు, ఏ భయమూ లేనట్లూ ఆమె ప్రవర్తించే తీరు చూస్తే మళ్ళీ ధైర్యం మొలకెత్తుతోంది.... ఈ మూడురోజుల పరిచయంలో ఎంత తొందరగా—ఎంత దూరంగా—ఎన్నిసార్లు క్షణికావేశపు పాశం ఇద్దరిమధ్య చిచ్చు రగిల్చి చల్లార్చింది.

జయకర్ గుండె వేగంగా కొట్టుకుంది. ఆ మూడు రోజులూ అతన్ని పట్టి పీడించిన ఆమె అనుభవాల స్మృతులు మళ్ళీ ముసురుకోవడం ప్రారంభించాయి....

ఇదే. ఈ ప్రపంచంలో మునిగి తేలుతూ నేను బాధ్యతల్ని విస్మరించాను. ఈ మత్తునుంచి బయటపడక పోతే నా భవిష్యత్తు ముక్కలవుతుంది. ఓ ఆడదాని కారణంగా నా భవిష్యత్తు బ్రద్దలుకావడం జరక్కూ

డదు. ఏ స్త్రీకీ నేనూహించుకొంటున్న భవిష్యత్తుతో పొసగదు. స్త్రీకి నా లైఫ్‌లో స్థానంలేదు.

ఈ నిశ్చయానికి వచ్చి జయకర్ తిరిగి టేబిల్ దగ్గర కూర్చొని వ్రాయడం ప్రారంభించాడు.

గౌహతిలో ప్రస్తుతం పరిస్థితి ప్రశాంతంగా వుంది. మూడురోజుల క్రితం కొన్ని చెదురుమదురు సంఘటనలు తప్పితే....

హైదరాబాద్ పత్రిక 'సైఫ్' రిపోర్టర్‌గా జయకర్ అయిదేళ్ళుగా పనిచేస్తున్నాడు. అతను చాలా చిన్న వయసులోనే కలం చేతబట్టి పిచ్చి గీతలు గీశాడు. కాలగమనంలో ఆ గీతల్ని కాస్త కళాత్మకంగా గీయడం నేర్చుకుని ఇప్పుడు రాటుదేలిన జర్నలిస్టు అయ్యాడు—

పత్రిక యజమానికీ, సంపాదకుడికీ అతనంటే మంచి అభిమానం వుంది కానీ—అనవసర సాహసాలకి పూను కొని పత్రికను ఇరకాటంలో పెట్టే అతని నిర్లక్ష్య స్వభావం న్యూసెన్స్‌గా పరిణమించి ఎంత కోపావేశాల్ని కల్గించినా; ఒక్కోసారి అదే దుడుకుతనంవల్ల బయటపడే గొప్పవాళ్ళ బండారాలు, సంస్థల కుంభకోణాలూ పత్రిక ఖ్యాతిని విస్తరింప జేస్తుండడంవల్ల, అతనిమీద ఇదమిద్ధంగా ఏ చర్యకూ పూనుకోలేని సందిగ్ధ పరిస్థితి ఏర్పడుతోంది.

వారంక్రితం అస్సాం పర్యటనకి అతన్ని పంపాలని నిశ్చయించినపుడు ఎడిటర్ రావ్ యజమానితో తీవ్రంగా వ్యతిరేకించాడు - అక్కడి సంఘటనల్లో అతని ప్రవేశం కష్టాల్ని తెస్తుందని. కానీ ప్రస్తుత పరిస్థితిలో అక్కడ అడుగుపెట్టే గట్స్ పత్రిక స్టాఫ్‌లో ఎవరికున్నాయని యజమాని అరిచాడు. చివరికి జయకర్ ప్రయాణమై

గౌహాతి చేరుకున్నాడు.

ఈ వారంలో మొదటి మూడు రోజులు రాష్ట్ర మంతటా పర్యటించి అక్కడ సాగుతోన్న 'విజా తీయుల్ని తన్ని తరిమేసి—స్వతంత్ర రాష్ట్రం ఏర్పరచు కొనే ఉద్యమం'లో జరిగిన అల్లర్లు, కొట్లాటలు, కూల్చి వేతలు, కాల్చివేతలు, పేల్చివేతలూ, దోపిడీలు, చంప డాలు, ముకుమ్మడి మారణ హోమాలు, దౌర్జన్యాలూ, వీటన్నిటినీ విజయవంతంగా తెర వెనుక వుండి నిర్వ హిస్తోన్న విద్రోహక శక్తులు, వీటిలో విచ్చలవిడిగా ప్రవహిస్తోన్న పొరుగు రాజ్యాల ఆయుధాలు, వీటిని అణచడానికి పోలీసు కాల్పులు, మిలటరీ చర్యలూ, పర్యవసానంగా నిషేధాలూ, కర్ఫ్యూలూ, ఫలితంగా సంభించిన ప్రజాజీవనం, ఆహుతులైన అనేకమంది అమాయక జనం, నిరాశ్రయులైన వేలాదిమంది దీన జనం, ఎటుచూసినా మృత్యుకళ తాండవించే నగర వీధులూ.... వీటన్నిటినీ కళ్లారా చూశాడు జయకర్.

చూసింది వ్రాశాడు. వ్రాసింది పంపాడు. అది గొప్ప కాదు. ఈ ఉద్యమంలో సరఫరా అవుతోన్న చైనా ఆయుధాలు ఎక్కడనుంచి వస్తున్నాయన్నది కనిపెట్టడం అతను చేయబూనిన కార్యాల్లో ముఖ్యమైనది. కానీ దాని గురించి ఇంకా లోతుగా ఆలోచించే లోపునే అల్కా ప్రవేశించి అతని మనసులో తిష్ట వేసింది. దానికి అధిపతియై పాలిస్తోంది. అంతా బెడిసికొట్టింది.

ఆమె కారణంగా ఈ మూడు రోజులూ ఏమీ పంప లేదు. అక్కడ రావ్ వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తుంటాడు. వారం రోజుల్లో పూర్తి కావల్సిన అస్సాం పర్యటన కాలేదు. రేపు మణిపూర్ వెళ్లవల్సి వుంది. ఈ

పరిస్థితుల్లో అది సాధ్యమవుతుందా?

రెండు గంటల్లో వ్రాయడం పూర్తి చేసి అతను చదువు తున్నాడు. చదువుతోంటే గుండె అదరసాగింది.... ఇంత గజిబిజిగా, పేలవంగా ఎప్పుడూ వ్రాయలేదు! ఇక అందులో విషయాలు ఎంతవరకు వాస్తవమో తనకే తెలియదు. ఆలోచించకుండా అరగంటలో డిస్పాచ్ చేసి తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు.

అపుడు జ్ఞాపకం వచ్చింది—అల్కా.

ఆమె ఫోన్ చేసి మూడుగంటలవుతోంది. ఇప్పుడు పన్నెండవుతోంది. ఆమె వెంటనే రమ్మనలేదూ?.... నా కోసం ఎదురు చూస్తుంటుంది. ఆమె హెచ్చరిక జ్ఞాపకంవచ్చి తటాలున టాక్సీ ఎక్కి బయలుదేరాడు.

2

జయకర్ అలా వెళ్ళకుండా వుంటే బాగుండేది.... అల్కా విషయంలో అతను తీసుకొన్న నిర్ణయంవల్ల ఎంతో మేలు జరిగి వుండేది. కానీ అతనిప్పుడు ఇదివరకటి జయకర్ కాదు. అతిడి మనసు కళ్ళెం తొలగించుకొని మళ్ళీ దౌడు తీసింది! ఇక దాన్నెవరూ ఆపలేరు. అదుపు చేయలేరు.

బెల్ పుష్ నొక్కిన కొన్ని క్షణాలకి అల్కా ద్వారములో ప్రత్యక్షమైంది.

జయకర్ నవ్వాడు.

ప్రతిగా ఆమె నవ్వలేదు; ముఖం ప్రసన్నమూ కాలేదు.

జయకర్ తటపటాయిస్తూ చూశాడు.

"అల్కా, అయాం సారీ.... కానీ నే నేం చెయ్యను?"

"లోనికిరా!" అందామె సుప్త కంఠంతో, వెనుదిరిగి నడుస్తూ.

జయకర్ లోనికెళ్ళి తలుపు మూశాడు. ఆమె బెడ్

రూంలోకి దారితీస్తోంది. అతను అనుసరించాడు—కసాయి వాడి వెంట మేకపోతులా.

ఆమె బెడ్ మీద కూలబడి వాలు కుర్చీ చూపించింది. "కూర్చో!"

"అయాం సారీ, అల్కా నిన్ను బాధపెట్టాలని కాదు గానీ...."

"చూడు! ఇలా క్షమాపణ చెప్పుకొని దీనంగా మొఖం పెట్టేవాళ్ళంటే నాకు చికాకు. కూర్చో. నీ పరిస్థితి నాకూ తెలుసు."

జయకర్ స్థిమితపడుతూ కూర్చుని అన్నాడు: "టైముకి రిపోర్ట్స్ అందకపోతే ఎడిటర్ తిడ్తాడు. ఈ మూడు రోజులు ఆకలితో మాడ్చివుంటాను. ఏదో గీసి పంపాను. అందుకే ఇంతాలస్యం...."

"నువ్వు మణిపూర్ ఎప్పుడెళ్తున్నావ్?" అడిగిందామె అతని మాటలు పట్టించుకోకుండా.

"అసలు రేపు వెళ్ళవల్సింది....కానీ ఇక్కడ....నీతో కాలక్షేపం చేస్తూ బాధ్యతలు విస్మరించాను. ఇక్కడ ఇంకా పని పూర్తి కాలేదు."

అల్కా అతన్ని ఓరగా చూసింది.

"నీకు బాధ్యతలు ముఖ్యమా? నేను ముఖ్యమా?"

అతను ఆశ్చర్యపడ్డాడు. "ఎందుకలా అడిగావు?"

"ముందు చెప్పు!"

జయకర్ పెదవులు చప్పరించి అంతలోనే నవ్వాడు.

"ఛో, అల్కా! ఎందుకలా అనుమానాలు పెట్టుకుంటావు? నువ్వంటే నా కిష్టంలేదని యెవరన్నారు? నాకు నువ్వెంతో బాధ్యతలూ అంతే."

"ఈ ఉద్యోగంలో తృప్తి వుందా నీకు?"

"ఉంది, చాలా వుంది."

"ఆర్థికంగా?"

"ఆర్థికంగా నాకే ఆశలూ లేవు. ఖర్చు పెట్టడానికి నా కెవరూ లేరు. డబ్బుగురించి నే నెప్పుడూ ఆలోచించలేదు. కానీ ఇప్పుడు నాకు నువ్వున్నావు. నీకోసం ఏది కావాలన్నా తెచ్చివ్వగలను....ఏదీ చెయ్యడానికి వెనుకాడను."

అల్కా లేచి వెళ్ళి ఫ్రిజ్ లో జిన్ తీసి గ్లాసుల్లో పోసి తెచ్చింది.

"నేనూ అదే వూహించాను" అందామె.

జయకర్ నవ్వాడు గ్లాసందుకొని. "చెప్పు, నీకేం కావాలి? నీకోసం ఏం చెయ్యమంటావు?"

"నాకోసం కాదు జయ్, మనకోసం!"

"ఓహ్, అందులో నావాటా కూడానా? చెప్పు, ఏం చెయ్యాలి?"

అల్కా గ్లాసు ఖాళీచేసి పెట్టింది. అతన్నిచూసి అదోలా నవ్వింది.

"స్వీట్ డార్లింగ్! నాకు తెలుసు....నువ్వే చెయ్యగలవు."

జయకర్ ఆమె భుజాలుపట్టి దగ్గరికి లాగాడు.

"ఏమిటి సంగతి? అంతలా వూరించకు."

ఆమె హఠాత్తుగా నవ్వి పెదవులందించింది. వెంటనే చటుక్కున విడిపించుకొని కిటికీ దగ్గరికెళ్ళి బయటికి చూసింది.

ఎండ తీవ్రంగా వుంది.

జయకర్ కాచుకున్నాడు.

"మొన్న కన్వార్ దగ్గర రైలు పడగొట్టిన ఉగ్రవాదుల ముఠా పట్టుబడిందా, జయ్?"

జయకర్ ఉలిక్కిపడ్డాడు. అయోమయంగా చూశాడు.

"అది నీకెందుకు. అల్కా?"

ఆమె ఇటు తిరిగి చూసింది. ఆమె కళ్ళలో ఇదివరకు ఎప్పుడూ చూడని మెరుపు చూసి బెదిరాడతను.

"మన భవిష్యత్తు వాళ్ళమీద ఆధారపడి వుంది జయ్."

"ఏమిటి నువ్వనేది? స్పృహలో వున్నావా నువ్వు?" అర్చాడతను.

"ఓహ్-హో! నన్ను మతిచెడినదానిలా ఎందుకు ట్రీట్ చేస్తావ్!"

"వాళ్ళతో నీకేమిటి అవసరం?"

"మన భవిష్యత్తు వాళ్ళవల్ల పండుతుంది. వాళ్ళ సహాయం మన కవసరం. వాళ్ళతో నా ఆలోచన ఫలిస్తే స్వతంత్రులమవుతాం! ఐశ్వర్యంలో మునిగి తేలుతాం!"

"నిజంగా నీకు పిచ్చెక్కింది, షటప్!"

ఆమె ఫక్కున నవ్వింది: "ఇలాంటి బరువైన మాటలు ఎన్నడూ వినివుండవు. బ్రహ్మచారివికదూ? బాధ్యతలు తెలియని వాడివి. జయ్, నాలో ఏం లోపం వుందని బొంబాయిలో బంగారంలాంటి మోడల్ జీవితం వదులుకొని ఈ ముసలాడివెంట వచ్చాననుకున్నావు? ఈ రెండేళ్ళుగా ఈ దరిద్రపు బ్రతుకు నెందుకు భరిస్తున్నాననుకున్నావు? అతని సోకాల్డ్ మగసిరీ రసికత చూసికాదు. అతని వందకరాల టీతోట చూసి; కేరళ బీచిలో త్రీస్టార్ హోటలు చూసి; డిస్పూర్ హైవుడ్ ఫ్యాక్టరీలో మేజర్ షేరు చూసి—ఇవన్నీ చూసి—అతని డబ్బు చూసి—ఈ జీవితానికి సిద్ధపడ్డాను."

"మరిప్పుడెందుకు బాధపడుతున్నావు? నువ్వతని భార్యవి. అవన్నీ నీకే చెందుతాయి."

"అవును. నాకే చెందుతాయి. కానీ ఎప్పుడు? అతను చచ్చినప్పుడు. ఎప్పుడు ఛస్తాడు? కనీసం పరో ఇరవై ఏళ్ళదాకా ఆ ఆశలేదు. ఇంత డబ్బు గడించినా ముసలి వాడికి ఏ దురలవాటూ లేదు. పైగా యోగాసనాలు వేస్తాడు. అతని చావుమీద నాకు నమ్మకం లేదు. అప్పటి వరకు నేనిక్కడ బానిసలా పడివుండి జీవితం వృధా చేయ లేను. ఎప్పుడో అతను చచ్చాక వచ్చే ఐశ్వర్యంతో ముసలి దాన్నయ్యాక నన్నేం చెయ్యమంటావు?"

"అందు కిప్పుడేం చేస్తావు?"

"జీవితాన్ని ఈ వయసులోనే అనుభవించాలి. మీనన్‌ని చూసి నేను చాలా మోసపోయాను. నా అంచనా తారుమారైంది. కోరుకున్న సౌఖ్యాలు లభించ లేదు. ఆర్థిక స్వాతంత్ర్యం లేదు. కోటీశ్వరుడి భార్యగా గుర్తింపులేదు. ఒక్కసారి నన్ను చూస్తే మీనన్ పిసినారి తనం కన్పిస్తుంది. నా వేషం చూడు. ఇంతకంటే ఆడంబ రంగా వుండలేను. ఖరీదైన దుస్తులు కట్టుకోలేను. నగలు పెట్టుకోలేను. హైసొసైటీలో తిరగాలంటే చెప్పరాని సిగ్గువేస్తుంది.ఇంటికెవర్ని ఆహ్వానించాలన్నా చిన్నతనంగా వుంటోంది.

"లేదు, జయ్! నేను చాలా విసిగిపోయాను. ఇహ ఈ బ్రతుకు చాలు. ఇంకా భరించలేను. నాకు విముక్తి కావాలి. నేను కన్న కలలు నిజం చేసుకోవాలి. ప్రపంచం లోని డబ్బంతా అనుభవించాలి. జీవితంలోని తియ్యదనం చవిచూడాలి. ఇంకెప్పుడో కాదు. ఇప్పుడే—ఈ వయసు లోనే."

"అసలు విషయానికి రా, అల్కా. ఏమిటి నీ ఆలోచన?"

"నిన్ను చూసినప్పుడే నాకీ ఆలోచన వచ్చింది. ఇది నీవల్లనే అవుతుంది: నువ్వు ప్రెస్ రిపోర్టర్‌వి. ఆ తీవ్రవాదుల్ని గాలించి పట్టుకోవడం నీకు కష్టంకాదు. వాళ్ళవల్ల ఈ బ్రతుక్కి విముక్తి లభిస్తుంది. ఈ సంపదంతా మనిద్దరిదవుతుంది....అతనికి వారసులు లేరు. విల్లు ఇంకా వ్రాయలేదు. ఈ ఆస్తులన్నీ అమ్మేసి మన ఇష్టమైన చోటుకి——"

జయకర్ అడ్డంగా తలూపాడు.

"అయాం సారీ, అల్కా. మనిద్దరి లక్ష్యాలు ఒకటి కావు. నీకు ఐశ్వర్యం కావాలి. నాకు దానిమీద మోజు లేదు. నేను కలలుగనే భవిష్యత్తు వేరు. నాకొక్కటే లక్ష్యం వుంది. అది డబ్బుతో నెరవేరదు. సామర్థ్యం కావాలి. సామర్థ్యం నాకుంది, కానీ సమయంలేదు. ఇంతవరకూ నేను రిపోర్టర్‌గానే కొనసాగుతూ వచ్చాను. ఇప్పుడు మరో మెట్టు ఎక్కాలనుకుంటున్నాను....ఈ వృత్తిలో కొంత తీరుబాటు చేసుకొని గ్రంథ రచనకు పూనుకుంటాను. దేశవ్యాప్తంగా పర్యటిస్తూ విరివిగా అనేక విషయాలమీద గ్రంథాలు వ్రాస్తాను. ఇంతా పేరు తెచ్చుకుంటాను. జర్నలిస్టు అనే ప్రతివాడూ ఏదో ఒక గ్రంథం వ్రాసితీరాలి! అప్పుడే నమ్ముకున్న వృత్తికి పరిపూర్ణత ఏర్పడుతుంది. నీ కరమవుతోందనుకుంటాను."

"అరమైంది. కానీ డబ్బు జీవితంలో ఒక భాగం. అదంటే ఎలర్జీ ఎవరికీ లేదు. అది లేనిది నువ్వేమీ చేయలేవు, ఎక్కడా తిరగలేవు. నీకున్న ఆర్థిక పరిధి మేరకు దేశవ్యాప్తంగానే పర్యటించాలనుకుంటున్నావు. కానీ నేను ప్రపంచం చుట్టి రావాలనుకుంటున్నాను.

నీ లక్ష్యాన్ని నేను నిరసించడం లేదు. నువ్వు గొప్ప

జర్నలిస్టువై దేశవ్యాప్తంగానే గాక అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకొంటూంటే—నీ ప్రక్కన నేను ఫలానా వాడి భార్యగా గుర్తింపూ, ఆదరణా పొందుతూంటే—ఎంత గర్వంగా వుంటుంది. నాక్కావల్సింది గుర్తింపు, జయ్. నువ్వు పొందే తృప్తీ సంతోషమూ ఒక్కడివే అనుభవించలేవు. భాగస్వామి వుండాలన్పిస్తుంది....ఆ భాగ్యం నాకివ్వు. నేను పంచుకుంటాను."

ఈ మాటలు జయకర్ కి సరిగ్గా ఎక్కడ తగలాలో అక్కడే తగిలి, కలుగవల్సిన ప్రభావం కల్గించాయి. గాడ్, ఈ ఆడవాళ్ళు వీక్ పాయింట్స్ని గురిచూసి కొట్టగల నేర్పుగలవాళ్ళు.

అతను తేరుకొని అయోమయంగా చూశాడు. అల్కా నవ్వింది.

"నాకు తెలుసు, నిన్ను ఒప్పించటం కష్టం కాదని. బ్రహ్మచారులు దృఢమనస్కులంటే నమ్మలేను. పైగా నువ్వు ధీరుడివి. భయపడవు—పిరికివాడివి కాదు. నాతో చెయ్యికలిపి ఈ పని చెయ్యడానికి వెనుకాడవు."

"ఏమిటి నువ్వు చెయ్యదల్చుకుంది?"

"నీకు తెలుసు, మానవ్ చచ్చిపోవాలి!"

"తెలుసు, కానీ ఎలా చేస్తావు?"

"రాత్రి బాగా ఆలోచించాను, జయ్. మంచి అయిడియా వచ్చింది."

"అయిడియాలు రావటం ఎప్పటినించీ!"

"నిన్ను చూసినప్పట్నుంచీ!" చమత్కరించిందిఅల్కా.

3

కన్వార్ గ్రామమంతటా B. S. F గస్తీ దళాలు అప్రమత్తతో ఉన్నాయి. వారం రోజుల క్రితం కల

కత్తాకు పైవుడ్ లోడ్ తీసుకువెళుతున్న రైలును ఇక్కడే పడగొట్టారు విద్రోహులు. ఆ తర్వాత విజాతీయులన్న ఉక్రోషంతో వందపూరిగుడిసెలు తగులబెట్టి, జనంమీద బాంబులు విసిరారు....

కన్వార్‌కు తూర్పున ఏడు కి.మీ.ల దూరంలో దట్టమైన పెద్ద అడవి వుంది. అందులో లోయలు, గుట్టలు, చెరువులూ కొల్లలు. అన్ని జాతుల క్రూరమృగాలు లేకున్నా ఉన్నంతవరకు తలచుకొంటే అడవిలో అడుగు పెట్టే ధైర్యం చలదు ఎవరికీ.

కన్వార్ చుట్టుపట్ల సాగిన రెండు విద్రోహక చర్యాలు మూలంగా తీవ్రవాదుల నెలవు అడవిలోనే ఎక్కడో ఉందన్న అనుమానాలున్నాయి అధికారులకి. లైను బాగు చేశాక మళ్ళీ రైళ్ళ రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఆ స్టేషన్‌లో దిగేవాళ్ళు చాలా తక్కువ.... దిగిన ప్రతివారూ పోలీసు ఇంటరాగేషన్‌ను ఎదుర్కోవలసిందే.

అందువల్ల జయకర్ రెండు స్టేషన్ల ఇవతల దిగిపోయి అల్కా ఇచ్చిన మ్యాపు ప్రకారం పది హేను మైళ్ళ ప్రయాణం కాలినడకన కట్టాడు.

ఈ అడ్డమార్గాన దూరం అదనంగా ఏడు కిలో మీటర్లు పెరుగుతుంది. కన్వార్‌లో దిగినా అక్కడి నుంచి అడవికి అంతే దూరాం నడవాలి.

జయకర్‌కు నమ్మకం లేదు—పోలీసులకే చిక్కని తీవ్ర వాదులు తనకెలా దొరుకుతారు. వాళ్ళసలు అడవిలోనే వున్నారా? లేక తను గుడ్డిగా వెళుతున్నాడా? అలా గుడ్డిగా వెళ్ళడం కూడా ప్రమాదకరమే. అడవి ప్రాంతాలా, అడవిలోనూ పోలీసులు తిరుగుతుండవచ్చు

గాలిస్తూ. తను వాళ్ళకి చిక్కితే....?

అతనికంతా గందరగోళంగా వుంది వ్యవహారం. త్వర పడి ఈ పనికి పూనుకొన్నాడేమో నన్పిస్తోంది....అల్కా మాటలు మందులా పని చేస్తున్నాయి. అవెలాటి దుష్పరి ణామాలకి దారి చూపిస్తాయో తెలిసినా, దానికి విరుగుడు అతనిదగ్గర లేదు.

ఆమె మత్తులోంచి అతను బయటపడలేదు.

అతని జ్ఞానేంద్రియాలన్నీ ఆమె గుప్పెట్లో వున్నాయి.

నడకవేగం పెంచి చెట్ల నీడలో నడుస్తూ, అంచెలంచ లుగా సాగే అల్కా పథకం గురించి ఆలోచించాడు. ఆమె ధైర్యం కలది. ఈ ఐశ్వర్యమంతా ఎప్పటికైనా నిస్సందేహంగా ఆమె హక్కులోకే వస్తుంది.

మీానన్ పిసినారితనం తెలుస్తోనే వుంది. అతన్ని చూస్తే విల్లులో భార్యకి తృప్తి కల్గించే భాగం కల్పిస్తా డన్న నమ్మకం లేదు. అల్కా ఈ విషయం గ్రహించినట్లు లేదు. ఆమె విల్లువరకూ ఆలోచించలేదు. ఆమెకు ఉధృత మైన కోర్కెలున్నాయి: వాటినిప్పుడే తీర్చుకోవాలి. ఒక్కొక్కసారి కోర్కెల పడగ నీడలో వుండటం యెంత ప్రమాదకరం. అవెప్పుడు కాటేస్తాయో తెలియదు.

ఇప్పుడు తననీ ఆ నీడలోకి లాగింది అల్కా. ఇప్పుడన్నీ భయాలే. కానీ ఇన్నేళ్ళ తన జీవితంలో సాధించిందేమి టని ఆలోచిస్తే, ఆ భయాలన్నీ పిరికితనపు చిహ్నాలుగా మాత్రమే కన్పిస్తున్నాయి. తను పిరికివాడు కాదు. తన నిర్లక్ష్యం, ఉదాసీనత జీవితంలో అతి ముఖ్యమైన ఘట్టాల్ని అనుభవించకుండా చేశాయి. ఇప్పుడు కనువిప్పు కల్గు తోంది—డబ్బులేని జీవితం ఎంత చప్పగా వుంటుంది.

అందమైన అతివ—అంతులేని ఐశ్వర్యం జీవితానికెంత వన్నె చేకూరుస్తాయి.

ఉత్సాహంగా నడుస్తున్నవాడల్లా ఉలిక్కిపడ్డాడు. జోసఫ్ జ్ఞాపకమొచ్చినప్పుడల్లా ఈ ఉలికిపాటు తప్పటం లేదు. శనిగాడు. వీడు పెద్ద అడ్డంకి. మానస్‌తో పాటు వీడుకూడా పోవాలి. లేదా వీడినుంచి అన్నివేపులా ప్రమాదాలే.

మానస్ ఈ బాడీగార్డుని యెక్కడ పట్టాడోగానీ, చిరుతపులికంటే ప్రమాదకరమైనవాడు దొరికాడు. వాడి రేడియం గోళాల్లా మెరిసే పచ్చటి కళ్ళల్లోకి చూస్తే చలి పుట్టుకొస్తుంది. మెరుపుకంటే వేగమైన వాడి కదలికల్ని చూస్తే జడత్వం ఆవహించుకుంటుంది.

ఈ భూమ్మీద వీడి ఉనికి క్షణంకూడా సుఖం ఇవ్వదు. మానస్‌తో పాటు వీడుకూడా పోవాలి—చావు తప్పి బయట పడకూడదు దెబ్బతిన్న పులిలా!

మరోగంట నడిచాక వెనుక ట్రాక్టర్ శబ్దమైంది.

ఇంకో గంట తర్వాత దానిమీద అడవి ప్రాంతాల చేరుకున్నాడు జయకర్—ట్రాక్టర్‌వాలాని మాటల్లో పెట్టి తనమీద ఆసక్తి కలిగే అవకాశం ఇవ్వకుండా చూస్తూ.

అప్పుడతను ఎంతో జాగ్రత్తగా చురుగ్గా పరిసరాల్ని కనిపెడ్తూ వేగంగా కనుమరుగైయాడు అడవిలోకి.

4

జయకర్ దూరంగా అస్పష్టంగా ఏదో శబ్దం విన్నాడు. అతని వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి.

ఏమిటా శబ్దం? గాభరాగా చుట్టూ చూస్తూ చెవులు రిక్కించాడు. ఆ శబ్దం క్రమంగా పెద్దదవుతూ, దగ్గరవు

తోంది. అతను జాగ్రత్తగా చెట్టును చాటుచేసుకొని నిల బడ్డాడు. శబ్దం ఇప్పుడింకా వేగంగా దగ్గరవుతోంది. సూటిగా కాలిబాటకేసి చూశాడు. కనుచూపు మేరలో ఏమీ కన్పించలేదు. ఇంతలో వున్నట్టుండి బాటమీద ఏదో ఊడి పడింది....దుమ్ము రేపుకొంటూ వురికివస్తోంది.. అది జీపు.

అతను కంగారుగా వెనక్కి చూశాడు. పది గజాల దూరాన పెద్దపెద్ద చెట్లు దట్టంగా వున్నాయి. జీపు తన కేసి వచ్చేస్తోంటే అటుకేసి పరిగెత్తాడు. సందేహించ కుండా ఎగిరి కొమ్మందుకొని చెట్టెక్కేశాడు. జీపు పూర్తిగా దగ్గరయింది....అప్పుడు స్పష్టంగా చూడగలి గాడు. అందులో మనుషుల్ని చూసి అతని గుండె ఆగింది.

పోలీసులు!

పోలీసులు గాలిస్తున్నారు. జయకర్ వొళ్ళంతా జలద రించింది. ఏం చెయ్యాలో అర్థం కాలేదు. కొమ్మల్లో జాగ్రత్తగా నక్కి కూర్చున్నాడు. దాటిపోతున్న జీపుని వూపిరి బిగబట్టి చూశాడు. అప్పుడనుకోకుండా అతని కళ్ళు దానిమీద పడ్డాయి....అది కొమ్మ చివరన చుట్ట చుట్టుకొని తలెత్తి తీక్షణంగా చూస్తోంది. కట్లపాము!

జయకర్ వెన్నులో చలి పుట్టింది. ఆకాశమంతా దట్టంగా మబ్బులు కమ్మివుంది. అరణ్యమంతా నిశ్శబ్దంగా వుంది. నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ జీపు శబ్దం దూరమవు తోంది.

జయకర్ అలికిడి కాకుండా చెట్టుమీంచి దూకేశాడు. వణుకుతున్న కాళ్ళతో నడక కష్టమైంది. బెదురుతూ, వెనక్కి తిరిగి చూస్తూ నడవసాగాడు. ఏమిటి దీని అర్థం? వాళ్ళు యెవర్ని గాలిస్తున్నారు? తీవ్రవాదుల్నా?

20

ఆకస్మాత్తుగా వాన చినుకులు ప్రారంభమయ్యాయి. అతను కసురుకుంటూ నడక వేగం పెంచాడు. ఇంకా పది గజాలుకూడ నడవలేదు, వాన ఒక్కసారిగా పెద్దదె కుండపోతగా కురవసాగింది. తిట్టుకుంటూ తడుస్తూ పరిగెత్త నారంభించాడు.

అతని అడుగులు విని కుందేళ్ళు, ఉడుతలు పొదల్లోకి గెంతుతున్నాయి. పక్షులు గాభరాపడి కూతలు కట్టి వేశాయి....కొంత దూరం వురికి, పూర్తిగా తడిసిపోయాక పెద్ద చెట్టు కన్పించింది. అదొక్కటే రక్షణ ఇవ్వగలదు.

దానికింద చేరి బ్యాగును నేలమీద పడేశాడు. సమయం 4 గంటలవుతోంది. ఉదయంనుంచీ నడుస్తున్నాడు. అడవిలోకి చాలా దూరం వచ్చేశాడు. ఈ ప్రయాణానికి గమ్యం యెక్కడో తెలియదు. గుడ్డిగా వెళ్తున్నాడు.

ఆ అడవిలోనే వాళ్ళెక్కడో వుంటారన్న నమ్మకంతో వెళ్తున్నాడు. ఇంతకంటే కన్వార్ ప్రాంతాల వాళ్ళకు అనువైన స్థలం లేదు. వాళ్ళ విధ్వంసక చర్యలు కూడా ఈ ప్రాంతాలే సాగుతున్నాయి. అయితే ఇందాక పోలీసుల్ని చూస్తే వాళ్ళు ఊరికేసి వెళ్ళిపోతున్నట్లు వున్నారు....వాళ్ళ గాలింపు ఇంకా ఫలించలేదు.

అరగంటలో వర్షం తగ్గాక తిరిగి బయలుదేరాడు.

బట్టలు, తల పూర్తిగా తడిసిపోయి చలి పుట్టసాగింది. బ్యాగులోంచి అల్కా ఇచ్చిన బిస్కెట్లు తిని, విస్కీ తాగాడు. కొన్ని రొట్టెముక్కలుకూడా తిని, శక్తి తెచ్చుకొని పావుగంటసేపు ఉరికాడు....అలా ఉరుకుతూనే వున్నాడు. గుడ్డిగా....ఇప్పుడొకటే ఆలోచన—ఈ అడవిలో గనుక వాళ్ళుంటే ఎక్కడో పొంచి వుండి పోలీ

సుల్ని గమనిస్తూంటారు. అలాగే తనూ వాళ్ళకంట పడ్తాడు. అప్పుడు వాళ్ళ చేతిలో పడ్డం చాలా సులభం.

అలా పరిగెడుతున్న జయకర్‌కి మళ్ళీ హఠాత్తుగా జీపు శబ్దం విన్పించింది. నెత్తిమీద పిడుగు పడ్డట్టయింది. ఒక్క దూకులో బాటమీంచి పక్కకు వెళ్ళి పొదల్లో పడ్డాడు. అక్కడ దాగి కూర్చొని, గుండె అదురుతోంటే జాగ్రత్తగా తొంగిచూశాడు.

వాళ్ళు జీపు దిగుతున్నారు ... యాభై గజాల దూరాన వున్నారు. ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, నలుగురు కానిస్టేబుల్స్ జీపు దిగి నేలమీద చూడసాగారు. ఏదో చర్చించుకో సాగారు....

అడుగుజాడలు! అడుగుజాడల్ని అనుసరిస్తున్నారు. హఠాత్తుగా వాళ్ళంతా ముందుకు కదలడం చూశాడు జయకర్. ఇన్‌స్పెక్టర్ల చేతుల్లో రివాల్వర్స్, కానిస్టేబిల్స్ దగ్గర రైఫిల్స్ వున్నాయి. వాళ్ళు నిశ్శబ్దంగా అడుగు జాడల్ని అనుసరిస్తూ వస్తున్నారు.

డామిట్! ఈ వర్షం నన్ను ముంచేసింది. తిట్టుకున్నాడు జయకర్. వాళ్ళిక నన్ను పట్టుకుంటారు! ఏం చెప్పాలి? నేను ప్రెస్ రిపోర్టర్‌ననీ, తీవ్రవాదుల్ని గాలిస్తున్నాననీ చెప్పేస్తే నమ్ముతారా? ఇప్పుడు నా దగ్గర ప్రెస్‌కార్డ్ లేదు. హోటల్‌లోనే వదిలాను, నేను రిపోర్టర్‌నని ఆ ముఠాకు తెలియడం మంచిది కాదన్న ఉద్దేశంతో. ఇప్పుడేం చెయ్యాలి?

అతను ఉలికిపడ్డాడు. ఓ.కే! నేను ప్రెస్ రిపోర్టర్‌నని రుజువు చెయ్యగలను. అయితే ఈ బ్యాగులో అయిదువేల రూపాయలకి, సంజాయిషీ ఏం చెప్పాలి? ఈ డబ్బు అల్కా ఇచ్చింది, ఆ ముఠాకు అడ్వాన్సుగా.

ఇంత డబ్బుతో నేనా ముఠాను గాలిస్తున్నానంటే పోలీసుల దృష్టిలో అర్థమేమిటి? ఏజెంట్‌వి! నువ్వేదో విధ్వంసక చర్యకు వాళ్ళ నెన్నుకొంటున్నావు! ఇలాగే ఆరోపిస్తారు పోలీసులు—

జయకర్ వాళ్ళకేసి గాభరాగా చూశాడు. నాన్సెన్స్ ఏమిటీ ఆలోచనలు? తాను పట్టుబడతాడని ఎందుకనుకోవాలి? పట్టుబడకుండా ఉపాయం ఆలోచించాలి! ఆలోచించాడతను—క్షణాల్లో ఆలోచిస్తూనే అందుకు పూనుకొన్నాడు.

గభాల్న లేచి పరుగుతీశాడు. నేలలో అతని బూట్ల గుర్తులు లోతుగా పడుతున్నాయి.

చెట్లూ, పొదల్ని చాటుచేసుకొంటూ దట్టమైన స్థలానికి చేరుకున్నాడు. అక్కడ గజిబిజిగా గెంతుతూ అడుగుజాడల్ని సృష్టించాడు. తర్వాత బూట్లు విప్పేసి ఒట్టి పాదాలతో సృష్టించాడు, అరచేతులతో నేలమీద ప్రాకాడు. బూట్లు బ్యాగులో దోపి, సిగరెట్ పెట్టి, కర్చీఫ్ తీసి క్రింద పడేశాడు. ఆ తర్వాత బ్యాగునందుకొని వట్టి కాళ్ళతో ఏపుగా, నడుము ఎత్తుకు పెరిగిన గడ్డిలోకి పరుగుతీశాడు. అక్కడ బోర్లా పడుకొని చెవులు రిక్కించాడు. వాళ్ళ మాటలు దగ్గర్లో, అస్పష్టంగా వినిపిస్తున్నాయి.

ఉన్నట్టుండి జయకర్ గట్టి కేక పెట్టాడు.

"హెల్ప్! రక్షించండి! కాపాడండి!"

అతని అరుపు వేగంగా వ్యాపించింది. వెంటనే అవతలి వేపు కేకలు విన్పించాయి. బూట్ల చప్పుడు అవుతోంది. వాళ్ళు అడుగుజాడల్ని వెంబడించి వస్తున్నారు...క్షణాల్లో వాళ్ళంతా జయకర్ సృష్టించిన భీభత్స స్థలానికి చేరు

కున్నారు. అక్కడ చెదరిన నేలను ఆశ్చర్యంగా చూస్తూ మాట్లాడుకోసాగారు.

"చూడండి. అతను క్రిందపడిపోయాడు. ఎవరో అతన్ని కొట్టి ఎత్తుకుపోయారు. అడుగుజాడలు అలా వెళ్తున్నాయి.... ఫాలో దెమ్!"

వాళ్ళు తనకేసి వచ్చేస్తోంటే జయకర్ లేచి శబ్దం గాకుండా తిరిగి కాలిబాట దిశకు వురికాడు. మెరుపులా చేరుకొని, దూరంగా ఆగివున్న జీపుకేసి చూశాడు.

జీపులో డ్రైవరు అటు తిరిగి కూర్చొని సిగరెట్ కాలుస్తున్నాడు. వెనుకనుంచి జయకర్ జాగ్రత్తగా చేరుకున్నాడు. పిల్లిలా వెళ్ళి డ్రైవర్ వెనుక నిలబడి, బ్యాగులోంచి బూటు తీసి దాని మడమతో మూడు మెరుపు దెబ్బలు నెత్తిమీద వేశాడు. డ్రైవర్ కిక్కురుమనకుండా కూలిపోయాడు. అతన్ని క్రిందకు లాగి పడేసి, జీపెక్కి స్టార్టుచేసి, వెనక్కి తిప్పి వచ్చినదారిన వేగంగా డ్రైవ్ చేశాడు. వాళ్ళు శబ్దం వింటే డ్రైవర్ బండిని తమవద్దకు తెస్తున్నాడనుకుంటారు....

కొంతదూరం వెళ్ళి ఆపేసి, దిగి బూట్లకు బురద అంటించి సీట్లమీద అద్దాడు. స్టీరింగ్ వీల్‌తోపాటు గేర్ లివర్‌ని శుభ్రంగా తుడిచేసి బ్యాగందుకొని వేగంగా చెట్లచాటుకి వురికాడు అనువైన స్థలం చూసుకొని, అక్కడ నిలబడి జీపుకేసి చూడసాగాడు.

పావుగంట గడిచాక వాళ్ళు స్పృహతప్పిన డ్రైవర్ నెత్తుకొని కంగారుగా వస్తూ కన్పించారు.

జీపుని చేరుకొని ముఖాలు చూసుకున్నారు. గట్టిగా అర్చారు.

"అతన్ని జీపులో వేసుకొని ఇక్కడికి తెచ్చాడు.

ఇక్కడ దిగి తిరిగి మోసుకొని వెళ్ళిపోయాడు" అన్నాడు ఒక ఇన్‌స్పెక్టర్.

"ఎక్కడికి?"

"అడుగుజాడలు చూడండి — వాళ్ళెక్కడికి వెళ్తుంటాడు. లెటజ్ గో!"

వాళ్ళంతా జీపెక్కలోంచే జయకర్ నవ్వుకున్నాడు.

జీపు స్టార్టయి వేగంగా ఊరికేసి వెళ్ళిపోయింది.

5

చీకటి పడింది.

కళ్ళకేమీ కన్పించడంలేదు.

టార్చి తీసుకురాలేదు. అది మంచిది కాదనుకున్నాడు. కాని ఇప్పుడు దాని అవసరం గుర్తిస్తున్నాడు. దాంతో సులభంగా వాళ్ళ చేతిలో పడవచ్చు! సిగరెట్ కూడా అందుకు ఉపకరిస్తుంది. కానీ ఉన్న ఒక్క ప్యాకెట్‌ని అక్కడ పారేశాడు.

ఇప్పుడు సమయం ఎనిమిది కావస్తోంది.

తను మధ్యాహ్నంనుంచీ నడుస్తోనే వున్నాడు. ఎంతకీ ఈ అడవి అంతం కావడంలేదు! ఇప్పుడు కాళ్ళు కూడా తీపులు పెడుతున్నాయి. ఈ చీకట్లో అడవిలో చుట్టూ తిరుగుతున్నాడేమో తెలియదు. అతని కళ్ళు మాత్రం ఒక దివిటీకోసం, చిన్న వెలుగుకోసం వెతుకుతున్నాయి. ఆ వెలుగు వాళ్ళ స్థావరం అయ్యే అవకాశం వుంది.

ఉన్నట్టుండి ప్రక్కన పిడుగుపడ్డట్లు—పటపటమని—శబ్దమైంది. అదిరిపడి ముందుకు వురికాడు.

మళ్ళీ అదే శబ్దం! వెంటనే నీళ్ళ చప్పుడు! నీరు అల్లకల్లోలమవుతోన్న అలజడి! కుదుటపడ్డాక ఆ చప్పుడేమిటో పసిగట్టాడు. మొసళ్ళు అలాగే అరుస్తాయి!

అప్పుడుగానీ తను పెద్ద చెరువు ప్రాంతాల వున్నట్లు గ్రహించలేదు. వెంటనే అక్కడనుంచి శక్తికొద్దీ పరుగు తీశాడు.

జయకర్ ఇలా అడవుల్లో ఎన్నడూ ప్రయాణించలేదు. అయినా ఇన్ని అపాయాల్ని తప్పించుకొంటూ ధైర్యంగా ముందుకు సాగడం అతనికి ఆశ్చర్యంగా వుంది. అది అల్లా మహాత్మ్యం అనుకున్నాడు.

ఇంతలో మళ్లీ ఏదో శబ్దం—అది నవ్వు. ఎవరో పగలబడి నవ్వుతున్న శబ్దం. అది మనిషి నవ్వుకాదు. జయకర్ వొళ్ళు జలదరించింది. దెయ్యం....దెయ్యం నవ్వుతోంది అతన్ని చూసి. అతను కొయ్యబారిపోయాడు. ఆ నవ్వు ఆగిపోయి మళ్ళీ ప్రారంభమైంది.

అప్పుడు జయకర్ వులికిపడి తేరుకున్నాడు. ఆ నవ్వు జాగ్రత్తగా విన్నాడు....హైనా! హైనా అరుపు అలాగే వుంటుంది!

అతని కాళ్ళూ చేతులు బిగుసుకు పోయాయి. అది తనని పసిగట్టిందా? అయితే పీక్కుతింటుంది. చీకట్లో ఎటు వురకాలో అర్థంకాలేదు. ఏదీ తేల్చుకొనే లోపున ఆ వికట నవ్వు భయంకరమైన కేకగా మారిపోయింది. ఆ తర్వాత మూల్గు విన్పించింది...

ఏం జరిగింది? అదెందుకలా మూల్గింది? మరేదైనా జంతువు వాతపడిందా? చచ్చిపోయిందా?

అతనా అయోమయ స్థితిలో ఎంతసేపున్నాడో తెలియదు చేష్టలుడిగి—వెనుకేదో అలికిడి విని చివాల్న తిరిగి చూశాడు. అతనివేపు మెరుపులా ఏదో దూసుకొచ్చింది.

దాన్ని పసిగట్టే లోపున ముఖంమీద గట్టి దెబ్బ

పడింది. వెర్రి కేకతో వెనక్కి పడ్డాడు. మరో దెబ్బ అతని పొట్టమీద పడింది.

జయకర్ ఓర్చుకోలేక మళ్ళీ అరిచాడు.

"ఇక ఆపు!" అన్నారెవరో.

"వీడెవడు?" మరో గొంతు పలికింది.

"అతన్ని లేపు!" మొదటి కంఠం ఆజ్ఞాపించింది.

జయకర్ బాధగా కళ్ళు తెరిచి చూశాడు. ఒక ఆకారం మీదకి వంగి చూస్తోంది. అది నడుముపట్టి అతన్ని లేపి నిలబెట్టింది. జయకర్ పూర్తిగా తేరుకోని వాళ్ళని చూశాడు. చీకట్లో మొఖాలు కన్పించలేదు. ఆ ఇద్దర్లో ఒకడు సైకిలెక్కి వున్నాడు.

"ఎవరు మిస్టర్ నువ్వు?" సైకిల్ మనిషి అడిగాడు.

"నేనెవరైతే నీ కెందుకు?"

"ఇక్కడేం చేస్తున్నావ్?"

"ఎక్స్‌కర్షన్ కొచ్చాను."

"అంటే?"

"ఓహ్, మీరు ఆదిమానవులు కదూ? ఇంగ్లీషురాదు."

"నోర్మూయ్! మేం తీవ్రవాదులం! సరిగా మాట్లాడక పోతే ఇక్కడే పాతేస్తాం!"

"ఓ.కే! ఓ.కే! మీరు తీవ్రవాదులని తెలియడానికలా అరవనవసరంలేదు! తెలుస్తోనే వుంది. మీతోనే నాకు పనివుంది. నన్ను మీ మొగుడి దగ్గరికి తీసుకెళ్ళండి—"

"ఏమన్నావ్?"

"మీ నాయకుడి దగ్గరికి తీసుకెళ్ళండి!"

సైకిల్ మనిషి అనుచరుడితో అన్నాడు: "ఇతన్ని సోదాచెయ్యి. పోలీసు మనిషయితే ఇక్కడే సఫా చెయ్యి."

జయకర్ నవ్వాడు. "చూసుకోండి! ఈ బ్యాగులో అయిదువేలు రొక్కం వుంటుంది, రొట్టెముక్క లుంటాయి...ఆయుధాలుండవు. పరికరాలుండవు. మిమ్మల్ని ఒక పనికి ఎన్నుకోవాలని వచ్చాను."

సోదా పూర్తయ్యాక అనుచరులు ఏదో మాట్లాడు కున్నారు.

"అచ్చా! మాతో నీకేం పని?" సైకిల్ మనిషి అడిగాడు.

"మీతో కాదు, మీ బాస్‌తో చెప్తాను. తీసు కెళ్తారా? నన్నే వెళ్ళమంటారా? టైం వేస్ట్ చెయ్యకండి కామ్రేడ్స్!"

మళ్ళీ వాళ్ళిద్దరేదో చర్చించుకున్నారు. సైకిల్ మనిషి తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు.

మిగిలినవాడు జయకర్ దగ్గరికొచ్చాడు, "పద, వెళ్దాం."

జయకర్ తేలికపడి బ్యాగందుకున్నాడు. ఇద్దరూ నడవసాగారు. కాస్సేపటి తర్వాత జయకర్ అడిగాడు, "అతనెక్కడికెళ్ళాడు."

"ఊళ్ళోకి!"

"ఏం పని?"

"నీ కనవసరం, అడక్కు!"

"సాయంత్రం ఇక్కడ పోలీసులు గాలించారు, తెలుసా?"

"మాకు అన్నీ తెలుసు."

"ఎలా తప్పించుకున్నారు."

"మాకు కొన్ని పద్ధతులున్నాయి. అవన్నీ నీకెందుకు?"

"ఇందాక అరిచింది హైనా కదూ?"

"అవును, తర్వాత నువ్వు అర్చావు."

"అది చచ్చిందా?"

"నమ్మకంగా. నేనే చంపాను."

"మొనగాడివి. పేరేమిటి?"

"సతీంకూల్."

"రష్యన్ పేరా?"

"ఎందుకనుకుంటున్నావు?"

జయకర్ నవ్వాడు. "నేనెప్పుడో ఓ రష్యన్ అనువాద నవల చదివాను. అందులో నీ పేరేగల బడుద్ధాయి పళ్ళసందునుండి ఉమ్ముతుంటాడు—తుంటరి వెధవ!"

"పేరేమిటి?"

"తొలి ఉపాధ్యాయుడు."

"పుస్తకం పేరు కాదు, నీ పేరు!"

"బాబ్ క్రిస్టో."

"తెలివిగలవాడిలా వున్నావ్. ఇందాకటి బహుమానం గుర్తుందా?"

"గుర్తుంది. నువ్వు వెన్నుదెబ్బ తీశావు. ఏం జరుగుతోందో తెలుసుకోలేకపోయాను. ఇప్పుడు కాచుకుంటావా?"

సతీంకూల్ పిడికిలి విసురుగా వచ్చి జయకర్ గడ్డం క్రింద తాకింది. వెనక్కిపడుతూ నిలద్రొక్కుకున్నాడు. సతీంకూల్ పిడికిలి మళ్ళీ మెరుపు వేగంతో వచ్చింది. జయకర్ తటాలున దాన్ని పట్టుకొని చెయ్యి మెలితిప్పి కాలితో కడుపులో తన్నాడు. సతీంకూల్ పొలికేక పెట్టాడు. జయకర్ అతన్ని వదలి రెండుచేతులూ బిగించి ముఖంమీద బాదాడు. అతను క్రిందపడి దొర్లుకుంటూ వెళ్ళి ఎక్కడ పడ్డాడో తెలియదు.

కాస్సేపటి తర్వాత, "సతీంకూల్!" అని పిల్చాడు.

"....క్రిస్టో! మేరెభాయీ!"

అరుపు విన్పించినవేపు వెళ్ళి చూశాడు. సతీం గోతిలో పడివున్నాడు. చెయ్యి అందించి లేపాడు. సతీంకూల్ ఆయాసంగా నిలబడుతూ, "మెచ్చాను యార్!" అన్నాడు.

"చచ్చావనుకున్నాను," అన్నాడు జయకర్.

సతీంకూల్ గట్టిగా నవ్వేశాడు "చలో భాయీ!"

6

వాళ్ళు నలుగురు బయటేదో అలికిడి విని చటుక్కున లాంతర్ నార్పేశారు. వాళ్ళచేతులు ఆయుధాలకోసం ప్రాకాయి చీకట్లో—కణకణ చప్పుడు. అదే క్షణంలో బయట చీకట్లో రెండు ఆకారాలు అస్పష్టంగా కన్పించాయి.

"ఉష్....సతీంకూల్" ఎవరో గుసగుసలాడారు.

"అవును. ప్రక్కన ఎవరది, హే?" మరో గొంతు పలికింది.

"రాందేవ్ కాదు, మఖన్."

"సైకిలేది, హే? రాందేవ్ ఏడి?"

బయిట విచిత్రమయిన అరుపు విన్పించింది—సతీంకూల్ సంకేతం.

"హే! లాంతర్ ముట్టించు."

చురుక్కున అగ్గిపుల్ల మండింది. మరుక్షణం లాంతరు వెల్గింది. అప్పుడే గుడారంలోకి ప్రవేశించిన రెండు ఆకారాల్ని పరీక్షగా చూశారు వాళ్ళంతా.

"ఇతను మనకోసం వచ్చాడు, మఖన్" సతీంకూల్ అన్నాడు, జయకర్ని చూపిస్తూ.

ఖాకీ నిక్కరు, బ్లూ షర్టులో ఉన్న అజానుబాహుడు ఎగాదిగా చూశాడు.

"ఎవరున్నవ్వు, హే? ఏం పని?"

జయకర్ భయపడకుండా అన్నాడు, "బాబ్ క్రిస్టో పేరు. మీరేమీ కంగారుపడ నవసరంలేదు. శత్రువుని కాను. మిమ్మల్ని కలుపుకోడానికొచ్చాను. మీతో పని వుంది."

మఖన్ సతీంకూల్ని ప్రశ్నార్థకంగా చూశాడు. అతను అంతా వివరంగా చెప్పాడు.

"మేమిక్కడ వున్నట్టు నీకెలా తెలుసు, హే?" మఖన్ అడిగాడు.

జయకర్ కింద కూలబడుతూ నవ్వాడు. "ఊహించాను. మీ చర్యలు కన్వార్ ప్రాంతాలే సాగుతున్నాయి. అందుకే పోలీసులకూడా ఈ అడవిమీద కన్నుపడింది...." అని తన అనుభవాల్ని, పోలీసుల్ని ఎలా దారిమళ్ళించిందీ వర్ణించి చెప్పాడు.

కాని ఎవరూ నమ్మలేదు. నమ్మరని తెలుసు.

మఖన్ సిగరెట్ వెలిగించాడు. "నీ రాక అనుమానాస్పదంగా వుంది, క్రిస్టో. నిన్ను పోలీసులు పంపలేదు కదా?"

జయకర్ తేలిగ్గా నవ్వేశాడు. "ఈ జోక్స్ మానేసి ఇక బిజినెస్ మాట్లాడుకుందామా, కామ్రేడ్?"

"ఏం బిజినెస్?"

"ఒక పార్టీని అంత మొందించాలి—ఇద్దర్ని."

ఎవరూ ఉలికిపడలేదు. తీక్షణంగా చూశారు.

"ఆ పని మేమెందుకు చెయ్యాలి, హే?"

"ఈ పార్టీలో మీ శాసక్తి వుంది గనుక."

"మాకా?"

"నమ్మకంగా మీకే. విజాతీయుల్ని తరిమేయడం— అంత మొండించడం మీ బిజినెస్. ఈ పార్టీ మీ జాతి కాదు. సిరపడ్డ పార్టీ."

"ఎక్కడనించి?"

"కేరళనుంచి."

"ఆగు మిస్టర్! నిన్ను చూస్తే సౌత్ ఇండియన్‌లా వున్నావు. నీ ముఖం చెపుతోంది. నకిలీ పేరుతో ఏమిటీ కథ? నీదేవూరు?"

"కొచ్చిన్. పేరు నకిలీ కాదు. ఈ పార్టీ మీద నాకు కక్ష వుంది. అది తీర్చుకోడానికి గౌహతి కొచ్చాను. మీ దగ్గరికి రావడం పొరపాటనుకోను. మీరు నా ప్రాణాలు తీయరు— నే చెప్పిన ప్రాణంతీసి లాభిస్తారు."

"బేటా క్రిస్టో, ఆ పార్టీ పేరు చెప్పు?"

జయకర్ పేరుతో సహా వివరాలన్నీ చెప్పాడు.

"హే! కృష్ణమీనన్! కాపిటలిస్ట్, అవునా?"

"అవును."

"అతనిగురించి మాకు బాగా తెలుసు. అతణ్ని గౌరవిస్తాం, శాఘిస్తాం. అతనీ ప్రాంతాన్ని అభివృద్ధిపర్చాడు. ఆర్థికంగా, పారిశ్రామికంగా అతను మళయాళీ కావచ్చు కానీ, అతని పౌరసత్వం ఇక్కడ 1951 కంటే చాలా పూర్వం నుంచి వుంది. 1944 లో సిరపడ్డాడు. అలాటి వాడు కాదు విజాతీయుడు. విజాతీయుడు '51 తర్వాత దేశ సరిహద్దు దాటి, ఇతర రాష్ట్రాలనుంచి తరలివచ్చి, ఇక్కడ మాకు నిరుద్యోగ సమస్య సృష్టించినవాడు. మా ఉనికినీ, సంస్కృతినీ గుర్తింపులేకుండా చేసినవాడు. వాడిని సహించం. కాని మీనన్‌లాటి వారిని కాదు."

"నేనిక్కడ రాజకీయ దృష్టితో రాలేదు. వ్యక్తిగత మోటివ్‌తో వచ్చాను. మీనన్‌ని చంపడం నా ధ్యేయం."

"అయితే ఆ పని నువ్వెందుకు చెయ్యకూడదు, హాఁ?"

"అది నావల్ల అయ్యే పనైతే మీ దగ్గరికి రావాల్సింది కాదు. మీ సహాయం కావాలి. అందుకు యాభై వేలు ఇవ్వడానికి సిద్ధంగా వున్నాను."

ఒక్కసారిగా శిబిరంలో కలకలం బయలుదేరింది.

యాభై వేలు! యాభై వేలు! ఆశ్చర్యరంతా.

"అవును. అయిదువేలు ఎర్నెస్టు మనీ, ఇదిగో తీసుకోండి. డబ్బు ముందు మీ రాజకీయ ఉద్దేశాలు వెలవెలబోతాయి. డబ్బుకు మరేదీ సాటిరాదు. డబ్బుని మించిందేమిటి? మీరీ పని చేస్తే అంత డబ్బు ముట్టుంది-యాభై వేలు. మిమ్మల్ని ప్రజల్లో స్వేచ్ఛగా తిరగనివ్వని రాజకీయ ఉద్దేశాల్ని ఎవరూ హర్షించరు. అది ఉన్మాదం. హింసామార్గం. మీకు తిండి పెట్టని ఈ రాజకీయాలకంటే, సిద్ధాంతాలకంటే, నే చెప్పిన పని చెయ్యరెట్లు నయమని పించటంలేదూ? ఆత్మవిమర్శ చేసుకోండి."

పది నిమిషాలు వాళ్ళ మధ్య చర్చసాగింది. అంతసేపూ జయకర్ సిగరెట్ తాగుతూ వుండిపోయాడు.

"బేటా క్రిస్టో, ఇదేదో పోలీసు ట్రాప్ కాదు కదా?" మఖన్ అన్నాడు చివరికి.

అతన్ని పరీక్షగా చూశాడు జయకర్. యాభై వేల రూపాయలకి ముఖంలో ఎంత కళ వచ్చింది.

"కాదు" అన్నాడతను. "మిమ్మల్ని డబుల్ క్రాస్ చేస్తున్నట్లు అన్పిస్తే శిక్షించండి."

"కానీ అంత డబ్బు నీ దగ్గరెక్కడిది?"

"ఈ అనుమానాలన్నీ రేపు మీనన్ బంగళా కొస్తే

తీరిపోతా'యి."

"మీనన్ బంగళాకా!"

"అవును: రేపు అతనుండడు. అక్కడే అన్ని విషయాలు వివరంగా మాట్లాడుకోవచ్చు. ప్లాను తయారుచేయవచ్చు."

"జేటా క్రిస్టో, మేం చాలా ప్రమాదకరమైనవాళ్ళం. మాతో ఆటలు, మోసాలూ మంచివికావు. నువ్వు డబుల్ క్రాస్ చేస్తే నీ ఆనవాలు నీ స్వంత తల్లికూడా గుర్తుపట్టదు. అర్థమైందా, హేం?"

"అర్థమైంది. నన్ను బేటా అని పిలవకు. నాకు నీలాంటి తండ్రి ఎప్పుడూ లేడు. రేపు మీనన్ బంగళాకి వస్తావా?"

"అక్కడికెందుకు, హేం? ఏమిటీ వ్యవహారం, వివరంగా చెప్పు?"

జయకర్ వాళ్ళకు వివరంగా కథ విన్పించాడు.

7

విద్రోహులు ఆరుగురూ రోడ్డు దిగువ గుంటల్లో పొంచి వుండి గుసగుసలాడుకోసాగారు.

చుట్టూ చీకటి. ఉండుండి వీచే గాలి హోరు తప్ప పరిసరాలన్నీ నిశ్శబ్దంగా వున్నాయి.

వాళ్ళక్కడ గంటసేపటినుంచీ కూర్చుని వున్నారు. వాళ్ళ జీవితాల్లో చాలా భాగం ఎదురుచూడ్డంలోనే గడిచిపోయింది కాబట్టి విసుగన్పించటంలేదు. మఖన్ ఎడమచెయ్యెత్తి డొక్కువాచీలో టైం చూసుకున్నాడు. పది కావడానికి అయిదునిమిషాలున్నాయి. మీనన్ ఎప్పుడో బయలుదేరి వుంటాడు. లెక్క ప్రకారం పది నిమిషాల్లో కారులైట్లు కన్పించాలి.

సతీంకూల్ ఒక్కసారిగా దిక్కులదిరేలా కేక

పెట్టాడు. అనుచరులదరిపడి చూశారు. అతను క్రింద దొర్లుతూ తన్నుకుంటున్నాడు. పిచ్చిగా అరుస్తున్నాడు.

"హే, సతీం! ఏమయింది!" అర్చాడు మఖన్ అగ్గిపుల్ల గీసి.

పరుచుకున్న వెలుతురులో అతని నోట్లో నురుగు చూసి తారు తిప్పోయారంతా!

పాము! పాము కాటేసింది!

అదే క్షణంలో దూరంగా హెడ్ లైట్లు కన్పించాయి! అవి వేగంగా దగ్గరవుతున్నాయి.

దాని శబ్దానికి అందరూ సతీంని వదిలేసి రోడ్డుమీదకు ప్రాకసాగారు. సతీం కూల్ తన్ని వదిలిపెట్టొద్దని అర్చాడు, ఏడ్చాడు. చివరికి శక్తి హరించి విషప్రభావానికి ప్రాణాలు విడిచాడు.

కారు పూర్తిగా దగ్గరవడంతో దాన్ని గుర్తించాడు మఖన్. అదే మీనన్ కారు! అతను చెయ్యెత్తి చిటిక వేయడం, విసురుగా అందరి చేతుల్లో గ్రెనేడ్స్ కారుకేసి దూసుకెళ్ళడం, దాన్ని తాకి పెద్ద శబ్దంతో అన్నీ ఒకేసారి ప్రేలిపోవడం, లిప్తపాటు కాలంలో జరిగిపోయాయి....

కార్లో వున్న బెంగాలీ బ్రదర్స్ అమరసేన్, సమరసేన్ లకి ఆ తాకిడి ఎట్లా అన్పించిందంటే — శుక్రగ్రహం అమాంతంగా వూడి నెత్తిమీద పడ్డట్టయింది!

ఏం జరుగుతుందో తెలియని సమర్ సేన్ సడన్ బ్రేకుతో కారాపేశాడు. మరొక గ్రెనేడ్ దొర్లుకుంటూ వచ్చి కారు క్రింద ప్రేలింది. మరొకటి బాయ్ నెట్ మీద పడి కాళ్ళముందు బ్రద్దలంది. అమర్ సేన్ కళ్ళు మూసుకొని పెద్దగా అర్చాడు. జుట్టు పీక్కొని డోర్ తెరిచి బయటికి

దూకేశాడు. అతని వెనుక అమర్ దూకాడు. ఇంకో గ్రెనేడ్ వాళ్ళిద్దరి వెనుక ప్రేలింది.

“ఓహ్, ఏమిటిది!” అమర్ సేన్ రోడ్డుదిగి బోర్లా పడుకొని కేక పెట్టాడు.

మరో గ్రెనేడ్ కారు తలుపుని విడగొట్టడంతో అది వచ్చి రోడ్డు దిగుతోన్న సమర్ సేన్ వీపుకి కొట్టుకుంది. అతను బోర్లాపడ్డాడు.

“కమాన్, షూట్!” అర్చాడతను రెచ్చిపోయి.

మరుక్షణం ఇద్దరి చేతుల్లో రివాల్వర్స్ ప్రత్యక్షమయ్యాయి....గుళ్ళు ప్రేలాయి. అవతలికి వెళ్ళి అవి ఆర్తనాదాల్ని సృష్టించాయ్. ఇద్దరూ ఆగకుండా కాలుస్తున్నారు. అవతల అరుపులు విన్పిస్తోన్నాయి. అవి నమ్మకంగా చావు కేకలు. బెంగాలీ బ్రదర్స్ గురి ఎప్పుడూ తప్పదు.

ఇంతలో కారు టైరు వూడి గిరగిర తిరుగుతూ వచ్చి అమర్ ముఖంమీద తాకింది. అతను పదిగజాలు వెనక్కి దొర్లాడు. అప్పుడే సమర్ చేతికేదో తాకింది....దాన్ని ముట్టుకుని నిశ్చేష్టుడయ్యాడు. క్షణం ఆలస్యం చెయ్యకుండా బలంకొద్దీ రోడ్డుకవతల విసిరాడు.

దాని తాకిడికి అవతల మరో ఆర్తనాదం విన్పించింది.

ఆ తర్వాత ఇంకేమీ జరక్కపోవడంతో లేచి అటువైపు పరిగెత్తారిద్దరూ. చీకట్లో అస్తవ్యస్తంగా పడివున్న శవాల్ని చూసి వెనుదిరిగారు. అప్పుడే దూరంగా హెడ్ లైట్స్ కన్పించాయి.

సమర్ ఉలికిపడి, “స్క్రామ్!” అనర్చాడు.

“వాళ్ళిద్దరు....?” అమర్ గొణిగాడు.

“ఓహ్, షడావ్! చచ్చివుంటారు. పారిపోవాలి.”

అమర్ సేన్ కారు దగ్గరికి పురికి ముందు సీట్లో, వెనుక సీట్లో చూశారు. మీనన్ జోసెఫ్‌లు క్రింద పడిపోయి వున్నారు. కదలిక లేదు. పలుకు లేదు. అతను ముక్కు దగ్గర వేలు పెట్టి చూశాడు. శ్వాసకూడ లేదు. వెంటనే జేబులో వున్న మరో రివాల్వర్ తీసి ముందుసీటుమీద పడేసి పరిగెత్తాడు.

"చచ్చారు....ఇప్పుడేం చెయ్యాలి?"

"ఓహ్, షటప్. స్క్రామ్!" అర్చాడు సమర్ అసహనంగా.

కారులైట్లు పూర్తిగా దగ్గరవుతోంటే ఇద్దరూ వెనక్కి తిరిగి సిటీకేసి పరిగెత్తసాగారు. వాళ్ళిద్దరూ పేరుపొందిన కిరాయి కిడ్నాపర్స్.

8

ఘటనా స్థలానికి పోలీసు దళాలు చేరుకున్నాయి.

కానీ అక్కడ మిగిలిందేమీ లేదు — కాలిపోయిన కారు అవశేషాలూ, ఉడికిన శవాలూ తప్ప. కారులో వున్న రెండు కళేబరాలు గుర్తించ వీల్లేకుండా వున్నాయి. కారు ఒక్కటే వాటి ఆనవాళ్ళి నిర్ధారించగలదు. రిజిస్ట్రేషన్ చెకింగ్‌లో దాని యజమాని కృష్ణమీనన్ అని తెలియడంతో పట్టణమంతా ఆ వార్త గుప్పుమని వ్యాపించి సంచలనం రేకెత్తించింది.

పోలీసులు F.I.R. తయారుచేశారు. దాని ప్రకారం మీనన్ తన బాడీగార్డు సమేతంగా డిన్నర్ బయలుదేరి వెళ్తుండగా దారికాచిన దుండగులు బాంబు దాడి జరిపి అటకాయించారు. అప్పుడు జోసఫ్ రివాల్వర్‌తో ఎదురు దాడి జరిపాడు—ఇలాగని దుండగుల శరీరాల్లో బుల్లెట్ రంధ్రాల్ని బట్టి నిర్ధారించారు—కానీ దుండగుల దాడి

ఇంకా తీవ్రం కావడంతో వాళ్ళిద్దరూ మరణించారు. ఇంతలో గౌహతికొస్తున్న ఒక ప్రయాణికుడు కారాపి జరిగింది గ్రహించి, వెంటనే సిటీ చేరుకొని పోలీసులకి తెలియజేశాడు.

అప్పుడు కారుకు నిప్పంటుకోలేదు. లోపల రెండు శవాలు సాధారణ స్థితిలో కన్పించాయి.

కానీ పోలీసులు చేరుకునేటప్పటికి కారు తగులబడి పోయి శవాలు కాలిపోతున్నాయి. కార్లో లగేజీ లేదు, రివాల్వర్ లేదు. పెట్రోల్ టాంకు పగిలివుంది.

దీన్నిబట్టి రిపోర్టిచ్చిన ప్రయాణికుడు ఆ స్థలంనుంచి నిష్క్రమించాక అక్కడెవరో వచ్చివుంటారనీ, వాళ్ళు కార్లో సామాను, రివాల్వర్‌తోబాటు శవం మీద వస్తువులు దోచుకొని పారిపోతుండగా పొరపాటున పారేసిన సిగరెట్ పీకవల్లనో; అగ్గిపుల్లవల్లనో, రోడ్డుమీద మడుగు కట్టిన పెట్రోలుకు నిప్పంటుకొని; ఆ మంటల్లో కారు తగులబడి పోయిందని నిర్ణయించారు.

బహుశ, ఆ దుండగులు దాడిలో చనిపోకుండా బయట పడ్డ ఉగ్రవాదులు కావచ్చనికూడ పోలీసులకి అనుమానం వుంది. అక్కడ మొత్తం నలుగురు దుండగుల శవాలు లభించాయి. దాడి జరిపిన వారెందరో లెక్క దొరక లేదు.

మీనన్ మరణంతో అతని భార్య అల్కాని యావదాస్తికీ ఎదురులేని సామ్రాజ్ఞిగా అభివర్ణించాయి పత్రికలు. ఆమె ఇప్పుడు మీనన్ ఐశ్వర్యంలో మునిగి తేలుతూ జలవిన్యాసాలు జరుపవచ్చని వ్యాఖ్యానించాయి....

తనగురించి పత్రికలు అలా వ్రాస్తాయని అల్కాకు ముందే తెలుసు. అది చదివి తనివిదీరా పొంగిపోవాలను

వుంది, గర్వపడాలనుకుంది. ఇన్నాళ్ళూ ఒక కోటీశ్వరుడి భార్యగా తనకా గుర్తింపూ, ప్రచారమూ లభించలేదు. ఆ కోరిక ఇప్పుడిలా తీరుతోందనుకుంది—తీరింది.

కానీ తాను కోరుకున్న విధంగా కాదు. ఆమె ప్రక్కన జయకర్ లేడు. ఈ ఆనందమంతా అతనితో పంచుకోవాలనుకుంది.... కాని అతని జాడ లేదు! రెండు రోజుల్నుంచి కన్పించడంలేదు; చెప్పకుండా ఇలా ఎక్కడికెళ్ళాడో అంతు చిక్కడంలేదు. హోటల్ గది ఖాళీ చేశాడు.

అతని పిలుపుకోసం, రాకకోసం, ఆమె తహతహలాడుతూ యెదురు చూస్తోంది. నిరాశా నిస్పృహాలతో కృంగిపోతోంది. జయ్! ఎందుకిలా చేశాడు? ధైర్యం కోల్పోయాడా! నన్ను వదలి పారిపోయాడా? ఇదే నిజమైతే నేనెలా జీవించడం? అతను లేకుండా నాకీ డబ్బు వద్దు.

కానీ, జయకర్ మాత్రం మణిపూర్‌లో మకాంవేసి మనసును బాధ్యతలమీద లగ్నం చెయ్యడానికి ప్రయత్నిస్తున్నాడు. అల్కాని విడిచి అతను పారిపోలేదు. ఒక వ్యవహారంలో తల దూర్చాక వెనక్కి తీసుకొనే ప్రసక్తి లేదు.

ఇప్పటి పరిస్థితిలో తను అక్కడ వుంటే అల్కాతో కలయిక తప్పదు. తను కలవకపోయినా ఆమె ఆ ప్రయత్నం చేస్తుంది. ఆమె చాపల్యం తనకు తెలుసు. ఆమె తొందరపాటుతో కలుగన్న సుస్థిరమైన బంగారు భవిష్యత్తును చిటికెలో ముగించివేస్తుంది—నల్గురికి అనుమానాలూ, అపోహాలూ రేకెత్తించి; తద్వారా తమ బండారమంతా వెల్లడిచేసే మతిలేని చేష్టలతో.

అందుకే అతను ఆమెతో చెప్పకుండా మణిపూర్ వచ్చేశాడు. అంతా సద్దుమణిగి, పరిస్థితులు చక్కబడ్డాక కలవాలనుకుంటున్నాడు. అప్పటికి అందరూ మీనన్ని మర్చిపోయి, అల్కాపట్ల ఆనాసక్తిని కనబరుస్తారు. అంత వరకూ ఇవతల తను బాస్ని తృప్తిపరుస్తూ అనుమానాలు కలక్కుండా చూసుకోడం మంచిదేకదా?

అయితే జయకర్కు ఒక విషయంలో అనుమానమూ, కొంత భయమూ వున్నాయి.

వార్తలు చూశాక మఖన్ ముఠా పూర్తిగా చావలేదని నమ్మకం కల్గింది. అక్కడ నల్గురి శవాలే దొరికాయి. మొత్తం ఆరుగురు దాడి జరిపారు. కాబట్టి ఇద్దరు తప్పించుకున్నారు. పోలీసు కథనంకూడా ఇదే—కాకపోతే సంఖ్య విషయంలో సంశయముంది. ఆ ఇద్దరే మీనన్ని దోచుకొని కారు తగలబెట్టారు. వాళ్ళని పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. ఒకవేళ పట్టుబడితే వాళ్ళు నోరు విప్పకుండా వుంటారా? ఆ ఇద్దరెవరు? అందులో మఖన్ వున్నాడా?

వాళ్ళు తనని కలుసుకోడానికి ప్రయత్నిస్తారా?

ఈ సంఘటన తర్వాత వాళ్ళెలా రియాక్టు అవుతున్నారు? నలుగురు అనుచరులు తమవల్ల చచ్చారు. అందుకు ప్రతీకారం తీర్చుకుంటారా? లేక ఇంకా డబ్బు డిమాండ్ చేస్తారా? ఒకవేళ వాళ్ళు రియాక్టు అయితే ఏ క్షణంలోనైనా అల్కా దగ్గరికెళ్ళవచ్చు. అప్పుడేమవుతుంది? ఆ విషయం తనకెలా తెలుస్తుంది? తానేం చెయ్యాలి?

అల్కా వొంటరిగా వుండకూడదు. ప్రమాదకరం....

ఇలా రెండు రోజులు ఆలోచనల తర్వాత మర్నాడు బయలుదేరడానికి పూనుకున్నాడు జయకర్.

గౌహతిలో బెంగాలీ బ్రదర్స్ అమర్, సమర్‌లు హోటల్‌లో మకాం వేసి పరిసితుల్ని గమనిస్తున్నారు. ఈ మిస్టరీ వాళ్ళ తల కెక్కడం లేదు. అసలు శుక్రగ్రహం షీకొన్న షాక్ నుంచి మర్నాటివరకూ కోలుకోలేదు.

ఆ సంఘటన వాళ్ళ గట్స్‌ని వూహించని రీతిలో పటాపంచలు చేసింది. పైగా పదివేల ఎసైన్‌మెంట్ మంట గలసింది. వాళ్ళ కిడ్నాపింగ్ బిజినెస్ బెడిసికొట్టింది.

అయితే ఈ నష్టం కల్గించిన వాళ్ళని వూరికే వదిలి పెట్ట దలచలేదు. వాళ్ళూ వార్తల్ని గమనిస్తున్నారు.

మీనన్ బంగళామీద ఓ కన్ను రిజర్వ్ చేసి వుంచారు. వాళ్ళక్కడ వస్తారన్న నమ్మకంతో కాదు; బెంగాలీ బ్రదర్స్‌కి కుతూహలం ఎక్కువ నమ్మకం కంటే. మీనన్ మీద దాడిచేసినోళ్ళు తెలివిహీనులైతే అతని ఇంటిమీద కూడా దాడి జరపవచ్చని ఆలోచన, ఆశ.

ఈ ఆలోచన పోలీసులకీ రాకపోలేదు. కానీ రక్షణ ఏర్పాట్లను అల్కా తిరస్కరించి తాను చాలా ధైర్యవంతురాలని పోలీసుల్ని నమ్మించాననుకుంది. కానీ అది పొరపాటు. జయకర్ మాటల్లో మతిలేని చేష్ట.

పోలీసు అదృశ్య నేత్రాలు మీనన్ బంగళాను గమనిస్తున్నాయి.

9

జయకర్‌ని చూసి అల్కా అఘాతం తిన్నట్టు అదిరి పడింది.

"ఓహ్, డార్లింగ్! ఎక్కడున్నావ్? ఏం చేస్తున్నావ్? నన్ను విడిచి—"

"షటప్! నేనెక్కడికీ పారిపోలేదు. పిరికివాడ్ననుకున్నావా?"

అతను బెడ్‌రూంలోకి దారితీసి మంచంపైన కూల బడ్డాడు. అతని ముఖం అలసటగా, నీరసంగా వుంది. అల్కా అతనిప్రక్కన చేరి చేతుల్లోకి తీసుకుంది ఆత్రుతగా.

"జయ్! ఏమయింది నీకు. బాగున్నావుకదా?"

"బాగున్నాను. బాగున్నాను. చాలా? ఇక్కడేం జరుగుతోంది?"

"ఏమీ లేదు. అంతా సవ్యంగా వుంది. నువ్వేమీ దిగులుపడకు, జయ్. నెలరోజుల్లో అంతా మనదవుతుంది. ఇక్కడ్నుంచి వెళ్ళిపోదాం. అంతా నీ చేతుల్లోనే పెడ్తాను, జయ్. నాకేమీ వద్దు. నేనే నీదాన్ని అయి నప్పుడు___"

"ఓహ్, ఇక ఆపు."

"ఏమిటి, జయ్?"

"నా గొంతు కాస్త తడుపు."

ఆమె అయోమయంగా లేచి వెళ్ళి విస్కీగ్లాసుతో తిరిగి వచ్చింది. అతను అందుకొని గటగటా తాగేశాడు.

"జయ్! ఏమిటిది? ఏమైంది? ఎందుకిలా వున్నావు?"

"నీకు మఖన్ మనుషులు కన్పించారా?"

"ఏమిటీ! మఖన్ మనుషులా!"

"అవును. నిన్ను కలిశారా?"

"నన్నా? ఎలా? వాళ్ళు చచ్చారుకదా!"

"ఇద్దరు చావలేదు."

"అయితే....నన్నెందుకు కలుస్తారు?"

"ఆ జోసఫ్ వాళ్ళని షూట్ చేసి మన ఒప్పందం గల్లంతు చేశాడు. మనం డబుల్ క్రాస్ చెయ్యమని హామీ ఇచ్చాం. కానీ ఇప్పుడదే జరిగింది___వాళ్ళ దృష్టిలో. తమ అనుచరుల చావుకి ప్రతీకారం తీర్చుకోకుండా వూరు

కోరు."

"అంటే....ఏం చేస్తారు?"

"ఎప్పుడైనా వూడిపడి మనిద్దర్నీ చంపేయవచ్చు. లేదా—"

"ఊం, లేదా? జయ్! ఇంకేం చేస్తారు?"

"డబ్బు గుంజవచ్చు, బ్లాక్ మెయిల్ చేసి."

"కానీ జయ్, జోసఫ్ దగ్గర రివాల్వర్ వుంటుందని మనం హెచ్చరించాం కదా?"

"అవును, హెచ్చరించాం."

"మరి వాళ్ళ చావుకి మన బాధ్యత ఏమిటి?"

"మన బాధ్యత లేదు. కానీ అది వాళ్ళు ఒప్పుకోరు. సవ్యంగా వున్నంతవరకు అన్నీ ఒప్పుకుంటారు. ఎక్కడ చిన్న పొరపాటు జరిగినా మనల్నే బ్లేమ్ చేస్తారు. అసలు తీవ్రవాదులంటే ఎవరు? సెమీ(క్రాక్స్—"

ధడాలున తలుపుతోసుకొని బెంగాలీ బ్రదర్స్ జొరబడ్డారు.

వాళ్ళ వికృతరూపాల్నీ, చేతుల్లో రివాల్వర్స్ నీ చూసి అల్కా కెవ్వుమని కేక పెట్టి బెడ్ మీంచి దూకేసింది. జయకర్ కదలకుండా బోర్లాపడుకొని కళ్ళు తేలవేశాడు.

"షడావ్. యూ లవర్ బాయ్, ఆ బ్యూటీని అరవొద్దని చెప్పు! దిసీజ్ సీక్రెట్ కాన్ఫరెన్స్" సమర్ సేన్ కంఠం కర్కశంగా పలికింది.

అమర్ సేన్ తలుపునో తాపు తన్ని గడియపెట్టాడు. అల్కాని చూసి అతను ఆశగా నవ్వాడు. ముందుకెళ్ళి ఆమె పెదాల్ని నలిపెయ్యాలనుకున్నాడు. కానీ సమర్ అది పసిగట్టి నివారించాడు.

"టేకిటీజీ, అమర్! ఇది సమయంకాదు. కమాన్.

లవర్ బాయ్! లేచి కూర్చో."

"జయ్!" అల్కా బిగ్గరగా అర్చింది, "వాళ్ళని బయటకు గెంటు! ఓహ్, త్వరగా వీళ్ళని తరుము ఇక్కడ్నుంచి."

జయకర్ తేరుకొని లేచి అయోమయంగా చూశాడు.

సమర్ నవ్వాడు. "ఏయ్, బ్యూటీ నీ లవర్ బాయ్‌కి మమ్మల్నెదుర్కొనే ధైర్యముందనుకోకు. నేనొక్క గుండు పేల్చానంటే ధైర్యంతో సహా ఎగిరి పోతాడు స్వర్గానికి."

"ఎవరు మీరు? ఇక్కడికెందుకొచ్చారు?" జయకర్ అర్చాడు కోపంగా.

అమర్ ఎడమచెయ్యెత్తి అతని మెడమీద కొట్టాడు.

అల్కా రైలింజన్ కూత వేసింది.

"నెమ్మది నెమ్మదిగా మాట్లాడు!" అమర్ అన్నాడు.

సమర్ సోఫాలో కూలబడి సిగరెట్ వెలిగించాడు. అతని ముఖం కర్కశంగా, వికృతంగా మారింది మళ్ళీ. కొన్ని క్షణాలు ఇద్దర్నీ తీక్షణంగా చూసి తలూపాడు.

"ఓ.కే. మీరన్నమాట గూడుపుఠాణి నడుపుతోంది? మీ మాటలన్నీ ఇందాక విన్నాను....నీ మొగుడ్ని ఆ ముఠాచేత చంపించి వీడితో పారిపోవాలనుకుంటు న్నావు డబ్బుతో! వెరీగుడ్. ప్రొసీడ్, బేబీ! మా కభ్యంతరంలేదు!"

"అయితే ఎందుకొచ్చావ్?"

"మీరు మా ప్లాను చెడగొట్టారు! మేం మీనన్‌ని కిడ్నాప్ చేసి ఒక పార్టీకి అప్పగించాల్సివుండి. కానీ మీవల్ల అది జరగలేదు. మా శ్రమ వృధా అయింది. తీసుకున్న డబ్బు వాపసు చెయ్యాలి. ఈ పరిహారం మీ

నుంచి రాబట్టుకోవాలని వచ్చాం."

"మీరు మీనన్‌ని కిడ్నాప్ చెయ్యాలనుకున్నారా!" జయకర్ అన్నాడు.

"చేశాం! కానీ మధ్యలో బెడిసింది. మీ ముఠా మా మీద దాడిచెయ్యడంతో వాళ్ళని చంపేసి ప్రాణాలు రక్షించుకుని బయటపడ్డాం."

"ఓహ్, అయితే ఇప్పుడేం చేస్తారు?"

"ఏమీ లేదు. మీరు క్షేమంగానే వుంటారు. నేను మాటిస్తాను—నేను కోరిన మొత్తం ఇస్తే."

"ఎంత? ఎంతకావాలి?"

"పది లక్షలు సరిపోతాయి. మీరిప్పుడు కోట్లలోపడి దొర్లుతున్నారు. నేనడిగింది పదోవంతుకూడా కాదు. వారంరోజుల్లో సిద్ధంచెయ్యకపోతే, సకల లాంఛనాలతో మీ దగ్గరకి పోలీసులొస్తారు. అర్థమైనట్టేనా?"

అల్కా జయకర్ ఒకర్నొకరు చూసుకొన్నారు. అల్కా ధైర్యం పుంజుకొని సమర్‌తో అంది.

"అంత డబ్బు సాధ్యంకాదు. ప్రభుత్వానికి లెక్కలు చూపాలి."

సమర్ నవ్వాడు. "ప్రభుత్వానికి లెక్కలు చూపడం సమస్యకాదు, మా రొక్కం సరిగా ముట్టకపోతే గొంతు మీదకొస్తుంది సమస్య!"

జయకర్ అసహనంగా అన్నాడు, "కానీ మీరు చంపిన ముఠాలో ఇద్దరు చావలేదు. అందుకు మీదే బాధ్యత! వాళ్ళిక్కడకొచ్చి మమ్మల్ని బ్లాక్‌మెయిల్ చేయవచ్చు. కాబట్టి మీ మొత్తం కొంత తగ్గించుకోవాలి."

"షడాప్! దిక్కుమాలిన ఎత్తులు వెయ్యక!"

సమర్ కసిరాడు, "వాళ్ళు మీ దారికి రాకుండా మేం చూసుకుంటాం. అందుకయ్యే ఫీజు ఈ పది లక్షల్లో నే సర్దేసాం. ఏమంటావు అమర్?"

"గుడ్ అయిడియా బ్రదర్."

బయట అడుగుల అలికిడితో పాటు తలుపుమీద చప్పుడయింది.

అందరూ ఉలికిపడి చూసుకున్నారు. అందరి ముఖాల్లో కలవరం స్పష్టంగా కనపడింది. ఎవరూ కదల్లేకపోయారు.

మళ్ళీ అదే చప్పుడయింది.

ఎవరిలోనూ చలనం లేదు.

మరోసారి చప్పుడు. టక్—టక్—టక్—

తలుపు తడుతోందెవరు?

"ఎవరూ?" అర్చింది అల్కా గొంతు చించుకుని.

"వాళ్ళొచ్చేసి వుంటారు...." అన్నాడు సమర్.

"పోలీసులా....?" జయకర్ గొణిగాడు.

అమర్ ఒక్క దూకులో రివాల్వర్‌తో వెళ్ళి తలుపు తీశాడు.

ముఖంమీద ముష్టిఘాతం పడ్డంతో వెనక్కి వచ్చి పడ్డాడు.

మీనన్ లోనికి చూసి, "వెరీగుడ్! మీరంతా ఒకే చోట వున్నారన్నమాట?" అన్నాడు.

10

అల్కా వెర్రికేక పెట్టి స్పృహ తప్పింది.

జయకర్ భయంతో కొయ్యబారిపోయాడు. సమర్ తెరిచిన నోరు మూయలేదు. అమర్ నేలమీంచి బెదుకుతూ లేచి నిలబడ్డాడు.

మీనన్ పైనుంచి క్రింది దాకా తెల్లగా మెరిసి

పోతున్నాడు. అతని వొళ్ళంతా కట్లున్నాయి. తెల్లటి లాల్చీ, ధోవతిలో వున్నాడు. కాళ్ళకి తోలుచెప్పులున్నాయి. చేతిలో సిగరెట్ తో భారంగా కదులుతూ లోనికి వచ్చాడు.

అతని వెనుక జోసఫ్ నీడలా కదిలివచ్చాడు. అతనికీ వొళ్ళంతా బ్యాండేజిలున్నాయి. ఖాకీ డ్రెస్ లో వున్నాడు. చేతిలో రివాల్వర్ తో చురుగ్గా చూస్తున్నాడు.

"యూ బ్లడీ బాస్టర్డ్స్. మీ చేతుల్లో గొట్టాలిలా పారెయ్యండి!" అర్చాడతను తీవ్రంగా.

బెంగాలీ బ్రదర్స్ తేరుకొని ఒకర్నొకరు చూసుకున్నారు. రహస్యంగా సైగలు చేసుకొను వూహించని విధంగా జోసఫ్ మీదకి విరుచుకుపడ్డారు. ఆ అదను చూసుకుని జయకర్ బయటకురబోయాడు.

కానీ జోసఫ్ అంతకంటే వేగంగా కాలెత్తి అమర్ పొట్టమీద ఫెడీమీద తన్నుతూనే, రివాల్వర్ పిడితో జయకర్ తలమీద బాదాడు. జయకర్ తలపట్టుకొని కూలబడ్డాడు. అమర్ వెనక్కి విరుచుకుపడ్డాడు.

సమర్ ఆవేశంగా రెండు చేతులతో జోసఫ్ గొంతు పట్టుకోబోయాడు. కానీ ముఖంమీద రివాల్వర్ బట్ ఖంగుమనడంతో స్ప్రింగ్ లా తన్నుకుపోయాడు.

"టేక్ కేర్! వెధవల్లారా, మీ తోలు వొలిచి కోటు కుట్టించుకుంటాను."

జోసఫ్ వాళ్ళదగ్గరికెళ్ళి రివాల్వర్స్ లాక్కున్నాడు. అంతా భయంగా, నిస్సహాయంగా చూడసాగారు. అల్కా ఇంకా ఫ్రిజ్ దగ్గర బోర్లాపడివుంది. మానస్ తేలిగ్గా నిట్టూర్చి సిగరెట్ వెల్గించి

సోఫాలో కూర్చున్నాడు.

"శభాష్, జోసఫ్! ఇక ప్రమాదం లేదు. ఉష్ష్.... ఈ ఉక్కలో మీరెలా వుంటున్నారు? వెళ్ళి ఏ.సి. మీట నొక్కు."

జోసఫ్ వెళ్ళి ఏ.సీ. ఆన్ చేశాడు. బెంగాలీ బ్రదర్స్ లేచి బట్టలు దులుపుకోసాగారు. జయకర్ అలాగే కూర్చుని మీనన్ని తీక్షణంగా చూశాడు. మీనన్ నవ్వాడు.

"మీరు—మీరెలా వచ్చారు?" జయకర్ గొణిగాడు.

మీనన్ పెద్దగా నవ్వి వూరుకున్నాడు.

బెంగాలీ బ్రదర్స్ అతన్ని కఠినంగా చూశారు.

"డామిట్! సమాధానం చెప్పవేం?" సమర్ కసిరాడు.

మీనన్ ఆ ఇద్దర్నీ ఏవగింపుగా చూశాడు.

"సమాధానం కావాలా మీకు? ఆల్ రైట్ దానితో బాటు తగిన శాస్తి కూడా లభిస్తుంది. మీరు—మీరు మమ్మల్ని చంపడానికి ప్రయత్నించారు. మేం—మే మిద్దరం చిటికెలో తప్పించుకుని బయటపడ్డాం. మీకు తగిన బుద్ధి నేర్పాలని సమయం కోసం ఎదురుచూసాం. ఇప్పుడిలా వచ్చాం. ఇదే సరయిన సమయం. చోటు.

"యూ ఫగ్స్! ఏ ప్రయోజనమాశించి మమ్మల్ని కిడ్నాప్ చెయ్యాలనుకున్నారు? డబ్బు కోసమా? ఎవరి నుంచి గుంజుతారు? నా డబ్బుమీద ఎవరికీ హక్కులేదు. ఎవరూ ఇవ్వలేరు. కాబట్టి మీరు డబ్బుకోసం ఈ పని చెయ్యలేదనిపిస్తోంది. మరో పార్టీకోసం చేశారు. మీ ముఖాలు చూస్తే తెలుస్తోంది—కిరాయి క్రూక్స్ అని. వెల్, ఆ పార్టీ ఎవరు?"

"అది బిజినెస్ సీక్రెట్, మై డియర్ ఓల్డుమాన్."

"నేనడిగింది కక్కకపోతే మీరూహించని గతి పట్టిస్తాను."

"పోలీసులకి పట్టిస్తావు, అంతేనా?"

"శిక్షలు నేనే స్వయంగా విధిస్తాను. నాతో సహకరించకపోతే జోసఫ్ మీ కాళ్ళలో షూట్ చేస్తాడు. అప్పటికీ మొండికేసే కత్తిపెట్టి తొడలు చీరేస్తాడు. ఇంకా దారికిరాకపోతే మీ గోళ్ళు పీకేస్తాడు. జోసఫ్ ప్రొఫెషనల్. మీ అమెచూర్ వేషాలు కట్టిపెట్టి చెప్పినట్టు వినండి."

"మా రిప్యుటేషన్ గురించి నీకు తెలియదు. మేం"

షూట్ అన్నాడు మీనాన్.

జోసఫ్ చేతిలో రివాల్వర్ పేలింది. కానీ బుల్లెట్ గురితప్పి గోడలో దూరింది. అది ట్రిక్. వాళ్ళ నదరగొట్టే చిట్కా.

అల్కా ఆ శబ్దానికి తటాలున లేచి కూర్చుంది. బెదురు చూపులు చూసి మళ్ళీ 'కెవ్వు'మనబోయింది. ఆమె దవడ పగిలేలా చేత్తో కొట్టాడు జోసఫ్.

జయకర్ వొళ్ళు చల్లబడింది.

బెంగాలీ బ్రదర్స్ కంగుతిని అలాగే నిలబడివున్నారు. ఏ క్షణాన శుక్రగ్రహం ఢీకొందో, అప్పుడే వాళ్ళ గట్స్ ఉఫ్‌మంటూ ఎగిరిపోయాయి.

"మేం మిమ్మల్ని సందీప్ సన్యాల్ కోసం కిడ్నాప్ చెయ్యాలనుకున్నాం" అన్నాడు సమర్ నెమ్మదిగా.

మీనన్ కళ్ళు విశాలమయ్యాయి.

"సందీప్ సన్యాల్? కలకత్తా కాంట్రాక్టరా?"

"అవును, సర్."

"ఓహ్. అతను చచ్చాడు కదా?"

"చచ్చాడా! ఎప్పుడూ?"

"నిన్న పేపర్లో చూశాను. మొన్న రాత్రి గుండె ఆగి చచ్చాడు."

"గాడ్! మాకు తెలియదు!"

"అతనెందుకీ పని చెయ్యమన్నాడు?"

"తెలియదు, సర్. మిమ్మల్ని కిడ్నాప్ చేసి మరొకరికి అప్పగించమన్నాడు."

"ఎవరికి?"

"అదీ తెలియదు, సర్. ఘూల్ పూర్ పొలాల్లో హెలికాపర్ లో దిగుతారని చెప్పాడు."

"హెలికాప్టర్? గూఢచారులా?"

"సారీసర్. వాళ్ళెవరో మాకు తెలియదు."

"సరే, నా శత్రువు చచ్చాడు. నాకిపుడు ప్రమాదం లేదు. ఆ వ్యవహారమంతా తర్వాత తెలుసుకొంటాను."

"మీరెలా బ్రతికి వచ్చారు, ఓహ్!" అల్కా అంది బలహీనంగా.

ఆమెని మీనన్ ప్రేమగింపుగా చూశాడు.

"అది పెద్ద కథ. క్లుప్తంగా చెప్తాను, టైము లేదు. ఈ క్రూక్స్ మమ్మల్ని హైవేమీద ఆపి, పెద్దమనుషుల్లా లిఫ్ట్ కావాలన్నారు. తాము బెంగాలీలమని చెప్పి, ఎవరో తరుముకొస్తున్నట్లు నటించారు. జోసఫ్ వాసన పసిగట్టాడు. కానీ, నేను పొరబడ్డాను. వెంటనే కారెక్కించుకొని బయలుదేరమన్నాను. ఈ ఇద్దర్లో ఒకడు ముందు సీట్లో, మరొకడు వెనుక నా ప్రక్కన కూర్చున్నాడు.

"కారు కొంత దూరమైనా వెళ్ళిందో లేదో, చీకట్లో

ఎవరికీ కన్పించని విధంగా ముందుసీట్లో వాడు జోసఫ్ తలమీద దేనితోనో కొట్టాడు. జోసఫ్ ముందుకు పడ్డంతో కారు అదుపు తప్పింది. నేను గట్టిగా అర్చాను. ఇంతలో నా పక్కనతను నన్నుకూడా అలాగే కొట్టాడు. కళ్ళుతిరిగి పడిపోయాను."

"అప్పుడేమైంది?"

"ఏమో. ఆ తర్వాత ఏం జరిగిందో నాకు తెలియదు. కానీ, ఒక్కసారిగా ఏవో చప్పుళ్ళు విన్పిస్తే కళ్ళు తెరిచాను. నా ఒళ్ళంతా నొప్పులు. కదల్లేకపోయాను. కారు మీదా క్రిందా ఏవో పడుతున్నాయి. బాంబులవి! వాటితో బాటు షాట్స్ విన్పిస్తున్నాయి. కార్లో నేను రాయిలా వుండిపోయాను. ఒళ్ళంతా రక్తం కారుతోంది. దిగి వురకాలనుకున్నాను. సాధ్యంకాలేదు....

హఠాత్తుగా ఆ శబ్దాలన్నీ ఆగిపోయాయి. నేనలాగే ఫుట్‌బోర్డుమీద పడివున్నాను. ఇంతలో బయట ఏదో కారాగడం, వెంటనే స్టార్టయి వెళ్ళిపోవడం విన్పించింది. అరవాలనుకున్నాను. అదీ సాధ్యం కాలేదు. అప్పుడే జోసఫ్ నన్ను పట్టి బయటికి లాగాడు. అతనికీ ఒళ్ళంతా గాయాలున్నాయి. మేం ఇంకా ఎలా బ్రతికి వున్నామో తెలియదు. ఈ క్రూక్స్ యెక్కడ పారిపోయారో అర్థంగాలేదు. అంతా సద్దుమణిగింది...."

"అప్పుడేం చేశావు?" అనుర్ అడిగాడు కుతూహలంగా.

"జోసఫ్ టార్చితో పరిసరాలు చూసి పరిగెత్తి వచ్చాడు. రోడ్డుకవతల శవాలున్నాయట. ఇద్దరం వెళ్ళి చూశాం. అయిదు ఆకారాలు కన్పించాయి. కానీ ఒకడు చావలేదు. వాడు బ్లూ నిక్కరులో వున్నాడు. అతని స్థితి

భయంకరంగా వుంది. కొన ప్రాణాలతో వున్నాడు. అతడు మమ్మల్ని చూసి పిల్చాడు. నా చేతుల్లో ప్రాణాలు వదులుతూ అంతా చెప్పేశాడు. అప్పుడే నాకు నీ వ్యవహారం తెలిసివచ్చింది—"

"మరి.... ఈ రెండు రోజులెక్కడున్నారు?" అడిగింది అలాక్—

"నా ఆస్తికోసం నువ్వెంతకు తెగించావో, ఎంత విశ్వాసఘాతం తలపెట్టి ప్రేమకలాపాలు సాగిస్తున్నావో అప్పుడు తెలిసి నిన్ను నరికి పోగువేయాలనుకున్నాను. కానీ జోసఫ్ నన్ను శాంతపర్చాడు. మీకు బుద్ధిచెప్పే సరైన ఉపాయం క్షణంలో ఆలోచించి చెప్పాడు. ఒప్పుకున్నాను. వీడి రాతి కళ్ళలో మీరు క్రూరత్వమే చూస్తారుగానీ, గుండె పొరల్లో దాగివున్న విశ్వాసం, విధేయత కన్పించదు."

"మీరేం చేశారసలు!"

"మేం చనిపోయినట్లు మీరు నమ్మాలి. నా సంపద చిక్కిందన్న ఆనందంలో మజా చేసుకొనే సమయంలో ఎంచక్కా నడచి వచ్చి—వెల్, మేం చచ్చామని లోకం నమ్మింది. కానీ చావలేదు. మా చావు ఫేక్. జోసఫ్ నాకా ఉపాయం చెప్పి రంగంలో కూకాడు.

"రెండు శవాలు కావాలి మాకు. అక్కడ నాలుగు శవాలకి బుల్లెట్ గాయాలున్నాయి. అవి వుండకూడదు. బ్లూ నిక్కర్ మనిషికి లేవు. వాడు బాంబు తగిలి చచ్చాడు. వెంటనే నా దుస్తులు వాడికి తొడిగి, వాడివి నేను వేసుకున్నాను. జోసఫ్ మరో శవంకోసం గాలించాడు. అప్పుడు దూరంగా ఒక వంటరి శవం కన్పించింది. దానికి బుల్లెట్ గాయాల్లేవు. నోట్లో నురుగుతో

అసహ్యంగా వుంది. పాము కరిచి వుంటుంది. జోసఫ్ వెంటనే ఆ శవంమీద తన దుస్తులు తొడిగాడు."

"అప్పుడేమైంది."

మీనన్ నవ్వేడు. "ఆ రెండు శవాల్ని కార్లో మోసి, మా సామానంతా తీసేసుకున్నాం. కారు టాంక్ పగిలి రోడ్డుమీద పెట్రోలు మడుగుకట్టింది....జోసఫ్ అగ్గిపుల్ల గీసి అందులో విసిరాడు. అంతే, గుప్పున మంటలు లేచి కారుకు నిప్పంటుకుంది.

"దాడిలో అది జరిగి వుంటే ఆ శవాలకు బదులు మేం సజీవంగా కాలిపోయేవాళ్ళం. కానీ దేవుడి కృపవల్ల అది జరగలేదు. దేవుడు మమ్మల్ని కాపాడాడు. దేవుడు దీనుల్ని కాపాడతాడు.

"మేం అక్కడనుంచి పరుగుతీశాం. పారిపోయాం. నా ఎస్టేట్ కి చేరుకొని డాక్టర్ని పిల్చి రహస్యంగా చికిత్స పొందాం.

"ఈ రెండు రోజులూ ట్రీట్ మెంట్ పొందుతూ, మిమ్మల్ని జాగ్రత్తగా గమనిస్తున్నాం. ఎస్టేట్ ఎక్జిక్యూటివ్ ఈ ఇంటిమీద—అక్కా మీద నిఘా వేశాడు. వీడు-ఈ జర్నలిస్టు బంగళాలో ప్రవేశించినట్టు నాకు ఫోన్ వచ్చింది. వెంటనే బయలుదేరి వచ్చేశాం. అప్పుడే ఈ క్రూక్స్ లోని కెళ్తున్నారు. వీళ్ళ వెనుక మేం వచ్చాం. వెల్, గది బయట వుండి మేం అంతా విన్నాం."

"కానీ, మీరిపుడు ప్రపంచానికెలా దర్శన మిస్తారు?" అమర్ అడిగాడు ఇంకా కుతూహలంగా.

మీనన్ నవ్వాడు. "నా దర్శనం అందర్నీ విస్మయ పరుస్తుంది. పోలీసులకి తీవ్రమైన షాక్. నా సాహసానికి ముక్కుమీద వేలేసుకొంటారు....అంతకంటే ఏంకావాలి!

బ్రహ్మాండమైన పబ్లిసిటీ. కదూ?"

"అయితే మా గురించి ఏమిటి?" సమర్ అడిగాడు.

"మీతో నాకు చాలా పని వుంది" అన్నాడు మీనన్, "ఒక విధంగా మీరు నా ప్రాణాలు కాపాడారు. మీరు కిడ్నాప్ చెయ్యకపోతే ఆ ముఠా చేతిలో మేం చచ్చేవాళ్ళం. మీరు వాళ్ళని చంపి మమ్మల్ని రక్షించారు."

"అయితే ఏం చేస్తారు?"

"ప్రతిఫలం చెల్లిస్తాను. కానీ మీరు తలపెట్టబోయిన హానికూడా దృష్టిలో వుంచుకుంటాను. నేను చెప్పినట్టు మీరు చేసే పోలీసు బెడద వుండకుండా చూస్తాను. అంతేగాక మీకు జోసఫ్ భయం కూడ వుండదు."

"ఏం చెయ్యాలి?"

మీనన్ అల్కాని, జయకర్‌ని చూశాడు కఠినంగా.

"ఆ ఇద్దర్ని మీరిద్దరు శిక్షించాలి."

అల్కా ఉలికిపడి జయకర్‌ని చూసింది. జయకర్ బొమ్మలా వున్నాడు.

"విన్నారా? వాళ్ళని శిక్షించాలి. ఇక్కడనుంచి తరిమి తరిమి కొట్టాలి. లేవకుండా కూర్చోకుండా చావగొట్టాలి. బట్టలు వొలిచి అడవిలో వదలిపెట్టాలి. మీకు తోచిన విధంగా చిత్రహింసలు పెట్టాలి. కాని చావకూడదు. అనుక్షణం బ్రతుకు దుర్భరం చెయ్యండి. ఎవరి సహాయమూ అండ దొరక్కూడదు. అలమటించి పోవాలి. ఆ నరకం భరించలేక వాళ్ళే ఆత్మహత్య చేసుకోవాలి. అదే వీళ్ళకి సరైన శిక్ష. అప్పుడే నాకు సంతృప్తి—"

అల్కా ముందుకు సాగి మీనన్‌ని పట్టుకుంది.

"మీనన్. నాకీ అన్యాయం చెయ్యకు."

మీనన్ విదిల్చికొట్టాడు. ఆమె వెళ్ళి జయకర్ మీద

పడింది. సమర్ ఆమె జుట్టు పట్టి లేపాడు. ఆమె కెవ్వు మంది.

"బయటికి లాగండి వీళ్ళని" అర్చాడు మీనన్, "ఈ పని చేస్తే మీకు ఇరవై వేలిస్తాను. వాళ్ళతో కుమ్మక్కు అయ్యారంటే మీరు తలపెట్టిన హాని గుర్తుకొస్తుంది.... అప్పుడు జోసఫ్ మిమ్మల్ని యెక్కడున్నా గాలించి నరికి పోగులేస్తాడు. అర్థమైందా?"

"మిమ్మల్ని పూర్తిగా నమ్మవచ్చు, సర్. మేం బెంగాలీ బ్రదర్స్ అని చాలా——"

"డామిట్! మీ రెవరైతే నాకేమిటి? చెప్పినట్టు చెయ్యండి."

జోసఫ్ బెంగాలీ బ్రదర్స్ మీదకి రివాల్వర్స్ విసిరి వేశాడు.

సమర్ రివాల్వర్ని అందుకొని అమర్ని చూశాడు. "కమాన్ లవర్ బాయ్, స్క్రామ్!"

అమర్ జయకర్ మెడపట్టి లాక్కెళ్ళాడు. జయకర్ ఎదురుతిరిగి పొట్టలో కుమ్మాడు. అమర్ నిలదొక్కుకొని రెండు చేతులు బిగించి దవడకింద కొట్టాడు. మరోదెబ్బ ముఖంమీద వెయ్యడంతో జయకర్ ముక్కునుంచీ, నోటి నుంచీ రక్తం చిమ్మింది. క్రింద పడ్డంతో అమర్ కాలర్ పట్టి లేపి వెనుకనుండి నడుముమీద చాచి తన్నాడు.

జయకర్ నడవలో దొర్లుకుంటూ వెళ్ళి మెట్లమీంచి జారిపడ్డాడు. అతని గావుకేక బంగళాను కదిలించివేసింది.

అల్కా ముఖంలో నెత్తురుచుక్క లేదు. ఆమె ముందుకు దూకి మీనన్ని పట్టుకుంది.

"మీనన్! నన్ను క్షమించు. మళ్ళెప్పుడూ ఇలా చెయ్యను. నాకీ అన్యాయం చెయ్యకు. నన్ను వీళ్ళపరం

చెయ్యకు."

మీనన్ జాలిగా నవ్వాడు: "నే నేం చేశాను? అంతా నువ్వేకోరి తెచ్చుకున్నావు. నన్ను చంపడానికి తెగిం చావు, నేను చచ్చాననుకున్నావు. మళ్ళీ ఈ సెంటి మెంట్స్ ఎందుకు? నేనిపుడు పునర్జన్మ ఎత్తాను: కళ్ళు తెరిచాను. నీతో నాకు గత జన్మలోనే చెల్లిపోయింది.... నువ్వెవరో నా కిపుడు తెలియదు, వెళ్ళిక్కడ్నుంచి."

"మీనన్! ప్లీజ్—ప్లీజ్—ప్లీ—"

"షటాప్!" సమర్ అర్చాడు అసహనంగా. "కమాన్, బేబీ! అవతల నీ లవర్ బాయ్ వెయిట్ చేస్తు న్నాడు."

అల్కా గింజుకుంటూ, తన్నుకుంటూ ఏడుస్తోంటే; సమర్ వెటకారంగా నవ్వుతూ లాక్కెళ్లాడు.

బయట మరోసారి జయకర్ కేక, వెంటనే అల్కా అరుపు విని మీనన్ నవ్వుకున్నాడు. పగలబడి నవ్వాడు. మెలికలు తిరుగుతూ పడీపడీ నవ్వసాగాడు....

అతన్ని చూసి జోసఫ్ గాభరా చెందాడు. అతని దుస్థితికి గుండె చెదిరింది. ముందుకు దూకి ఆదుర్దాగా అతన్ని పట్టుకొని శాంతపర్చాడు.

"బాస్! ఓహ్, బాస్! రిలాక్స్. ప్లీజ్ రిలాక్స్, బాస్! యూ మస్ట్ రిలాక్స్. ఇప్పుడేమైందని? అంతా సవ్యంగా జరిగింది...."

"అంతా సవ్యంగా జరిగింది, వాళ్ళని అరెస్టు చేశాం" అన్నాడు పోలీస్ కమీషనర్, తన బలగంతో గదిలోకొస్తూ.

—:ఐపోయింది:—